

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | శుక్రవారం 30-01-2026 | సంపుటి - 26 | సంచిక -251 | రూ : 4 | పేజీలు: 8


## కేసీఆర్ కు..
## నోటీసులు అందించిన సిట్

- నంది నగర్ లోని నివాసంలో నోటీసులు అందించిన సిట్
- విచారణకు పీఎస్ కు రావాల్సిన అవసరం లేదన్న సిట్ అధికారులు
- ప్లేస్ చెబితే తామే అక్కడకు వస్తామని వెల్లడి




2లో



## కొలువైన సమ్మక్క

- జనజాతరగ మారిన మేడారం
- వనం జనమైంది
- ఏర్పాట్లు పర్యవేక్షించిన రాష్ట్ర మంత్రులు
- మొక్కులు చెల్లించిన కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, ఓరా

4లో



## పంజాబ్ సరిహద్దుల్లో భారీ కుట్ర భగ్నం..

### డ్రగ్స్, ఆయుధాల స్మగ్లింగ్ ముఠా గుట్టురట్టు



2లో

- అమృత్‌సర్ రూరల్ పోలీసుల మెరుపు దాడి
- 42,983 కిలోల హెరాయిన్, నాలుగు హ్యాండ్ గ్రెనేడ్లు, ఒక స్టార్ మార్క్ పిస్టల్, 46 లైవ్ బుల్లెట్లు స్వాధీనం
- వివరాలు ఎక్స్ వేదికగా పంజాబ్ డీజీపీ గౌరవ్ యాదవ్ వెల్లడి

## ఏపీలో 2 లేన్ల జాతీయ రహదారులను
## 4 లేన్లుగా మార్చండి

- ఏపీలో జాతీయ రహదారుల ప్రాజెక్టులపై సీఎం చంద్రబాబు సమీక్ష
- రోడ్ నెట్‌వర్క్ విస్తరణ, రోడ్ డెన్సిటీ పెంపుపై కీలక చర్చ
- ప్రాజెక్టుల అమలులో ఏపీ బెంచ్‌మార్క్‌గా ఉండాలని దిశానిర్దేశం
- 2-లేన్ల రహదారులను 4-లేన్లుగా మార్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచన



2లో

## యూజీసీ 2026 నిబంధనలపై సుప్రీంకోర్టు స్టే




2లో

- యూజీసీ 2026 సమానత్వ నిబంధనలను నిలిపివేసిన సుప్రీంకోర్టు
- తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు 2012 నిబంధనలే అమల్లో ఉంటాయని ఆదేశం
- జనరల్ కేటగిరీకి అన్యాయం చేసేలా ఉన్నాయని దాఖలైన పిటిషన్లపై విచారణ

### మౌలిక సదుపాయాల్లో
## దూసుకెళుతున్న భారత్

**ఆర్థిక సర్వే 2026లో కీలక విషయాలు**

- మౌలిక రంగంలో భారత్ దూకుడును వెల్లడించిన ఆర్థిక సర్వే 202526
- పదేళ్లలో మూడు రెట్లు పెరిగిన పునరుత్పాదక ఇంధన సామర్థ్యం
- 2014 నుంచి రెట్టింపునకు పైగా పెరిగిన విమానాశ్రయాల సంఖ్య
- జాతీయ రహదారుల నెట్‌వర్క్‌లో 60 శాతం వృద్ధి
- ప్రభుత్వ మూలధన వ్యయం 4.2 రెట్లు పెరిగిందని వెల్లడి



2లో

## అజిత్ పవార్ అంత్యక్రియల్లో
## నారా లోకేశ్..

- బారామతిలో అజిత్ పవార్ అంత్యక్రియలు
- నివాళి అర్పించిన నారా లోకేశ్
- అంత్యక్రియలకు హాజరైన అనగాని, కృష్ణదేవరాయలు, మాగుంట



2లో

### ఆత్మవిశ్వాస భారత్‌కు
## ఈయూ ఒప్పందం నిదర్శనం

- భారత్-ఈయూ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై ప్రధాని మోదీ కీలక వ్యాఖ్యలు
- నాణ్యతతో యూరప్ మార్కెట్లను గెలుచుకోవాలని తయారీదారులకు సూచన
- 'వికసిత్ భారత్ 2047' సాధన దిశగా ప్రభుత్వం ముందుకు వెళ్తోందని స్పష్టీకరణ
- తొమ్మిదోసారి బడ్జెట్ ప్రవేశపెట్టడంపై నిర్మలా సీతారామన్‌ను అభినందించిన మోదీ



2లో

# మౌలిక సదుపాయాల్లో దూసుకెళుతున్న భారత్.. ఆర్థిక సర్వే 2026లో కీలక విషయాలు

ఢిల్లీ: భారతదేశ వృద్ధి వ్యూహంలో మౌలిక సదుపాయాల రంగం కేంద్ర స్థానంలో ఉందని, ఈ రంగంలో ప్రభుత్వ మూలధన వ్యయం స్థిరంగా పెరుగుతోందని ఆర్థిక సర్వే 202526 స్పష్టం చేసింది. ఇవాళ విడుదల చేసిన ఈ సర్వే ప్రకారం, ప్రైవేట్ పెట్టుబడులను ఆకర్షించడంలో భారత్ ప్రపంచంలోనే అగ్రగామి దేశాల్లో ఒకటిగా నిలిచింది. తక్కువ, మధ్య ఆదాయ ఆర్థిక వ్యవస్థలలో మౌలిక సదుపాయాల కల్పనలో ప్రైవేట్ పెట్టుబడుల విషయంలో ప్రపంచ బ్యాంకు ర్యాంకింగ్స్‌లో భారత్ టాప్5 దేశాల్లో ఒకటిగా నిలిచింది. పీఎం గతిశక్తి, జాతీయ లాజిస్టిక్స్ పాలసీ వంటివి ఈ వృద్ధికి దోహదపడ్డాయని సర్వే పేర్కొంది. దీనివల్ల లావాదేవీల ఖర్చులు, ప్రాజెక్టుల అమలులో రిస్కులు తగ్గాయి. ప్రభుత్వ మూలధన వ్యయం ఎఫ్‌వై18లో రూ. 2.63 లక్షల కోట్ల నుంచి ఎఫ్‌వై26 నాటికి రూ. 11.21 లక్షల కోట్లకు, అంటే దాదాపు 4.2 రెట్లు పెరిగింది. జాతీయ రహదారుల నెట్‌వర్క్ 2014లో 91,287 కిలోమీటర్ల నుంచి 2026 డిసెంబర్ నాటికి 1,46,572 కిలోమీటర్లకు విస్తరించింది. విమానయాన రంగంలో విమానాశ్రయాల సంఖ్య 2014లో 74 నుంచి 2025 నాటికి 164కు పెరిగింది. రైల్వే నెట్‌వర్క్‌లో 99.1 శాతం విద్యుదీకరణ పూర్తయింది. 'మారిటైమ్ ఇండియా విజన్' వంటి పథకాలతో భారత పోర్టుల పనితీరు మెరుగుపడి, 7 పోర్టులు ప్రపంచ బ్యాంకు టాప్ 100 జాబితాలో స్థానం దక్కించుకున్నాయి. విద్యుత్ రంగంలోనూ భారీ విస్తరణ జరిగింది. మొత్తం స్థాపిత సామర్థ్యం 509.74 గిగావాట్లకు చేరగా, ఇందులో పునరుత్పాదక ఇంధన వాటా దాదాపు 49.83 శాతంగా ఉంది. గత దశాబ్ద కాలంలో పునరుత్పాదక ఇంధన సామర్థ్యం మూడు రెట్లకు పైగా పెరిగి 253.96 గిగావాట్లకు చేరుకుందని సర్వే తెలిపింది. పునరుత్పాదక ఇంధన ఉత్పత్తిలో భారత్ ప్రపంచంలో మూడో స్థానంలో ఉంది.

## అజిత్ పవార్ అంత్యక్రియల్లో నారా లోకేశ్..



మహారాష్ట్ర: మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ భౌతికకాయాన్ని రాష్ట్ర విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేశ్ సందర్శించి నివాళులు అర్పించారు. బారామతిలో నిర్వహించిన అజిత్ పవార్ అంత్యక్రియల్లో మంత్రి లోకేశ్ పాల్గొన్నారు. దివంగత అజిత్ పవార్ కు నివాళులర్పించిన వారిలో రాష్ట్ర రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీనేత లావు కృష్ణదేవరాయలు, ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి ఉన్నారు. మరోవైపు అజిత్ పవార్ అంత్యక్రియలను ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో నిర్వహించారు. అంత్యక్రియలకు కేంద్రమంత్రులు అమిత్ షా, నితిన్ గడ్కరీ హాజరయ్యారు. మహారాష్ట్ర సీఎం, డిప్యూటీ సీఎంతో పాటు రాష్ట్ర మంత్రులు, ఇతర పార్టీలకు చెందిన కీలక నేతలు కూడా హాజరయ్యారు.

## ఏపీలో 2 లేన్ల జాతీయ రహదారులను 4 లేన్లుగా మార్చండి

అమరావతి: రాష్ట్రంలో రోడ్ నెట్‌వర్క్‌ను మరింత బలోపేతం చేయడంపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఇందులో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతిలోని తన క్యాంప్ కార్యాలయంలో జాతీయ రహదారుల ప్రాజెక్టులపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం 2 లేన్లుగా ఉన్న జాతీయ రహదారులను 4 లేన్లుగా విస్తరించేందుకు తక్షణమే ప్రణాళికలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో రాష్ట్రంలో జాతీయ రహదారుల నెట్‌వర్క్ విస్తరణ, రాష్ట్ర రహదారుల అభివృద్ధి, రోడ్ డెన్సిటీ పెంపుదల వంటి కీలక అంశాలపై చర్చించారు. ప్రస్తుతం కొనసాగుతున్న ఎన్‌హెచ్ ప్రాజెక్టుల పురోగతిని, కొత్తగా చేపట్టాల్సిన రహదారుల నిర్మాణం గురించి అధికారులతో సమీక్షించారు. ప్రాజెక్టుల అమలులో ఆంధ్రప్రదేశ్ దేశానికే ఒక బెంచ్‌మార్క్‌గా నిలవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. పనుల్లో నాణ్యత, వేగం పాటించాలని స్పష్టం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి, ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు, జాతీయ రహదారుల సంస్థ (NHAI)కు చెందిన పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## అజిత్ పవార్ విమాన దుర్ఘటన... బ్లాక్ బాక్స్ దొరికింది!

మహారాష్ట్ర: బారామతి సమీపంలో జరిగిన ఘోర విమాన ప్రమాదంలో మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ మృతి చెందిన ఘటనపై దర్యాప్తులో కీలక పురోగతి చోటుచేసుకుంది. ప్రమాదానికి గురైన విమానం బ్లాక్ బాక్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు వెల్లడించారు. ఈ మేరకు మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌కు గురువారం ఆయన అధికారికంగా లేఖ రాశారు. ఈ దురదృష్టకర ఘటన పట్ల కేంద్ర విమానయాన మంత్రిత్వ శాఖ తీవ్ర విచారం వ్యక్తం చేస్తోందని రామ్మోహన్ నాయుడు తన లేఖలో పేర్కొన్నారు. ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ విషయాన్ని అత్యంత సీరియస్‌గా తీసుకున్నట్లు స్పష్టం చేశారు. ప్రమాదం జరిగిన వెంటనే ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (AAIB), డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (DGCA) బృందాలు ఘటనాస్థలానికి చేరుకుని ఉన్నత స్థాయి విచారణ ప్రారంభించినట్లు తెలిపారు. ఫ్లైట్ డేటా రికార్డర్ అయిన బ్లాక్ బాక్స్‌ను స్వాధీనం చేసుకోవడం దర్యాప్తులో అత్యంత కీలకమని భావిస్తున్నారు. విమానం చివరి క్షణాల్లో ఏం జరిగిందనే దానిపై ఇది స్పష్టత ఇవ్వనుంది. అధికారులు ప్రస్తుతం సాంకేతిక రికార్డులు, ఆపరేషనల్ లాగ్స్, ఘటనాస్థలంలోని ఆధారాలను పరిశీలిస్తున్నారు. ఈ దర్యాప్తు పూర్తి పారదర్శకంగా, నిర్దిష్ట కాలపరిమితిలో జరుగుతుందని రామ్మోహన్ నాయుడు హామీ ఇచ్చారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా చూసేందుకు, ప్రాథమిక, తుది నివేదికల ఆధారంగా అవసరమైన భద్రతాపరమైన సిఫార్సులు, చర్యలు అమలు చేస్తామని ఫడ్నవీస్‌కు హామీ ఇచ్చారు. దర్యాప్తునకు సహకరిస్తున్న మహారాష్ట్ర ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## పంజాబ్ సరిహద్దుల్లో భారీ కుట్ర భగ్నం..

పంజాబ్: పంజాబ్ సరిహద్దు ప్రాంతాల్లో పోలీసులు పెద్ద ఎత్తున సాగుతున్న మాదకద్రవ్యాలు, ఆయుధాల అక్రమ రవాణా కుట్రను భగ్నం చేశారు. విలేజ్ డిఫెన్స్ కమిటీ (వీడీసీ) నుంచి అందిన కీలక సమాచారంతో అమృత్‌సర్ రూరల్ పోలీసులు మెరుపు దాడి నిర్వహించి భారీ మొత్తంలో హెరాయిన్‌తో పాటు మారణాయుధాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఆపరేషన్‌కు సంబంధించిన వివరాలను పంజాబ్ డీజీపీ గౌరవ్ యాదవ్ సోషల్ మీడియా వేదిక ఎక్స్ ద్వారా వెల్లడించారు. దాడుల్లో మొత్తం 42,983 కిలోల హెరాయిన్, నాలుగు హ్యాండ్ గ్రెనేడ్లు, ఒక స్టార్ మార్క్ పిస్టల్, 46 లైవ్ బుల్లెట్లు, అలాగే నిందితులు వదిలివెళ్లిన ఒక మోటార్‌సైకిల్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. విలేజ్ డిఫెన్స్ కమిటీ సభ్యుల అప్రమత్తత వల్లే ఈ భారీ స్మగ్లింగ్ ప్రయత్నాన్ని అడ్డుకోవడం సాధ్యమైందని పోలీసులు పేర్కొంటూ, వారి సహకారాన్ని ప్రశంసించారు. ఈ ఘటనకు సంబంధించి అమృత్‌సర్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేయగా, పరారీలో ఉన్న ఇతర నిందితుల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. స్వాధీనం చేసుకున్న డ్రగ్స్, ఆయుధాలు ఎక్కడి నుంచి వచ్చాయి? వీటి వెనుక పనిచేస్తున్న అంతర్జాతీయ స్మగ్లింగ్ నెట్‌వర్క్ ఏమిటి? అన్న అంశాలపై దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు తెలిపారు. దేశ భద్రతకు ముప్పు కలిగించే ఇలాంటి కుట్రల వెనుక ఉన్న అసలు సూత్రధారులను త్వరలోనే పట్టుకుంటామని డీజీపీ గౌరవ్ యాదవ్ స్పష్టం చేశారు.

## కల్తీ నెయ్యిపై అసెంబ్లీలో జగన్ చర్చకు రావాలి: మంత్రి కొల్లు రవీంద్ర

అమరావతి: కల్తీ నెయ్యిపై అసెంబ్లీలో చర్చకు వైకాపా సభ్యులతో కలిసి జగన్ రావాలని ఏపీ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. గత ఐదేళ్లలో శ్రీవారి ప్రసాదం కల్తీ చేసే అపవిత్ర కార్యానికి జగన్ తెరలేపారని విమర్శించారు. ''దేవుడిపై నమ్మకం లేకే దోపిడీ కోసం నిబంధనలు సడలించారు. డెయిరీలకు భారీ ఆర్డర్లు ఇచ్చి హవాలా ముడుపులు అందుకున్నారు. లడ్డూకు వాడిన నకిలీ పదార్థాల్లో రసాయనాలు వెలుగు చూశాయి. పూర్తి నివేదిక వచ్చాక మరిన్ని వాస్తవాలు వెలుగులోకి వస్తాయి'' అని మంత్రి కొల్లు అన్నారు.

* **వైకాపా నేతలకు భారీగా ముడుపులు: ప్రభుత్వ విప్ కాలవ**

''జగన్ ఐదేళ్ల పాలనలో ఎన్నో పాపాలు జరిగాయి.



ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది శ్రీవారి భక్తుల విశ్వాసాలకు విఘాతం కలిగింది. ఆధ్యాత్మిక చింతన, దైవభక్తి లేని కరుణాకర్ రెడ్డి, వైవీ సుబ్బారెడ్డి లాంటి వారిని ఛైర్మన్‌లుగా నియమించి భక్తుల మనోభావాలను దెబ్బతీశారు. పవిత్రమైన తిరుమల లడ్డూను కల్తీ నెయ్యితో నాసిరకంగా తయారు చేశారు. వైకాపా నేతలకు పెద్ద ఎత్తున హవాలా సొమ్ము అందింది. తిరుమలలో నెయ్యి కల్తీ బాధ్యులను కఠినంగా దండించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నా'' అని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు వెల్లడించారు.

* **వైకాపా నాయకుల్లో భయం: ఆదిరెడ్డి శ్రీనివాస్**

''శ్రీవారి లడ్డూ ప్రసాదంలో జరిగిన తప్పిదాలను మా కూటమి ప్రభుత్వం బయటకు తీసుకొస్తున్న కొద్దీ వైకాపా నేతలకు భయం పట్టుకుంది. లడ్డూ ప్రసాదంలో వైకాపా నేతలు అపచారం చేశారు కాబట్టే గత ఎన్నికల్లో ఘోరంగా ఓడిపోయారు. స్వామివారి లడ్డూ ప్రసాదంలో కల్తీ జరిగిందని దేశ అత్యున్నత న్యాయస్థానం ఏర్పాటు చేసిన సిట్ విచారణలో తేలింది. ఐదేళ్ల వైకాపా పాలనలో లడ్డూ ప్రసాదంలో కల్తీ చేయడం వల్ల అక్రమంగా రూ.250 కోట్ల వరకూ ఆర్జించారు. చిరు ఉద్యోగి అయిన చిన్న అప్పన్న ఖాతాలో రూ. 4.69 లక్షలు ఎందుకు జమ అయ్యాయి? 20 కోట్ల లడ్డూల్లో జరిగిన అవినీతి గురించి మాట్లాడకపోతే దేని గురించి మాట్లాడాలి?'' అని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ప్రశ్నించారు.

* **వారికి బాగా తెలుసు: మాజీ ఎమ్మెల్యే వర్మ**

''పాలతో పనిలేకుండా రసాయనాలు ఉపయోగించి నెయ్యి ఎలా తయారు చేయవచ్చో వైకాపా నేతలకు బాగా తెలుసు. తిరుమల పవిత్రతకు భంగం కలిగించేలా, భక్తుల విశ్వాసాలు దెబ్బతీసేలా వ్యవహరించినవారికి శిక్ష పడాలి. తొలి నుంచీ వైకాపా నేతల నేర ప్రవృత్తి భిన్నంగా ఉండేది. కోడికత్తి, గులకరాయి, గుండెపోటు, గొడ్డలివేటు, పరకామణి దొంగతనం సహా వారే చేసి.. తెదేపాపై నెట్టేయాలని ప్రయత్నాలు చేశారు. వైకాపా అక్రమాలను ప్రజల ముందు పెట్టాలని సీఎం చంద్రబాబుకు విజ్ఞప్తి చేస్తున్నాం'' అని మాజీ ఎమ్మెల్యే వర్మ తెలిపారు.

## యూజీసీ 2026 నిబంధనలపై సుప్రీంకోర్టు స్టే

ఢిల్లీ: ఉన్నత విద్యా సంస్థల్లో సమానత్వ ప్రోత్సాహం కోసం యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) తీసుకొచ్చిన 2026 నిబంధనల అమలుపై సుప్రీంకోర్టు ఇవాళ మధ్యంతర స్టే విధించింది. తదుపరి ఉత్తర్వులు ఇచ్చేంత వరకు 2012 నాటి పాత నిబంధనలే అమల్లో ఉంటాయని స్పష్టం చేసింది. ఈ వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వానికి, యూజీసీకి నోటీసులు జారీ చేసింది. యూజీసీ కొత్త నిబంధనలు జనరల్ కేటగిరీ విద్యార్థుల పట్ల వివక్ష చూపించేలా ఉన్నాయని, వారికి ఫిర్యాదు చేసే యంత్రాంగాన్ని నిరాకరిస్తున్నాయని ఆరోపిస్తూ పలు పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిపై విచారణ చేపట్టిన సీజేఐ సూర్యకాంత్, జస్టిస్ జాయ్ మాల్యా బాగ్చీలతో కూడిన ధర్మాసనం ఈ ఉత్తర్వులు జారీ చేసింది. "మేము జోక్యం చేసుకోకపోతే, ఇది ప్రమాదకరమైన ప్రభావాన్ని చూపుతుంది. సమాజాన్ని విభజిస్తుంది, తీవ్ర పరిణామాలకు దారితీస్తుంది" అని ధర్మాసనం ఈ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేసింది. కొత్త నిబంధనల ప్రకారం 'కుల ఆధారిత వివక్ష' అనే పదాన్ని కేవలం ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాలకే పరిమితం చేశారని పిటిషనర్లు ఆరోపించారు. దీనివల్ల జనరల్ కేటగిరీకి చెందిన వారికి ఎలాంటి వివక్ష ఎదురైనా ఫిర్యాదు చేసే అవకాశం లేకుండా పోతుందని, ఇది రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 15(1), 21లను ఉల్లంఘించడమేనని వాదించారు. పిటిషనర్ల వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం, 'సంపూర్ణ న్యాయం' కోసం రాజ్యాంగంలోని ఆర్టికల్ 142 కింద తమకున్న ప్రత్యేక అధికారాలను ఉపయోగించి ఈ నిబంధనలను నిలిపివేస్తున్నట్లు తెలిపింది. అనంతరం తదుపరి విచారణను మార్చి 19వ తేదీకి వాయిదా వేసింది.

## ఆత్మవిశ్వాస భారత్‌కు ఈయూ ఒప్పందం నిదర్శనం: ప్రధాని

ఢిల్లీ: బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ పార్లమెంట్ వెలుపల మీడియాతో మాట్లాడారు. భారత్‌యూరోపియన్ యూనియన్ మధ్య కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (FTA), "ఆశావహ, ఆత్మవిశ్వాస, ఆత్మనిర్భర్ భారత్" స్ఫూర్తిని ప్రతిబింబిస్తోందని అన్నారు. 21వ శతాబ్దపు ఈ త్రైమాసికంలో భారతదేశం ప్రపంచానికి ఒక ఆశాకిరణంగా, ఆకర్షణ కేంద్రంగా మారిందని పేర్కొన్నారు. దేశ ఆర్థిక, ప్రజాస్వామ్య బలంపై ప్రపంచానికి పెరుగుతున్న విశ్వాసానికి ఇదే నిదర్శనమని తెలిపారు. ఈ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం ద్వారా భారతదేశానికి, ముఖ్యంగా యువతకు ఉజ్వల భవిష్యత్తు లభిస్తుందని మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు. "భారత్, యూరప్ మధ్య ఈ చారిత్రాత్మక ఒప్పందం కుదిరినప్పుడు మన పారిశ్రామికవేత్తలు, తయారీదారులు కేవలం పన్నుల తగ్గింపు గురించే ఆలోచించకూడదు. ఇది నాణ్యతను చాటుకోవాల్సిన గొప్ప అవకాశం. ఇప్పుడు మార్కెట్ మన కోసం తెరుచుకుంది. అత్యుత్తమ నాణ్యతతో యూరప్‌లోని 27 దేశాల హృదయాలను మనం గెలుచుకోవాలి. ఇది దీర్ఘకాలంలో మనకు ఎంతో మేలు చేస్తుంది" అని ప్రధాని వివరించారు. ఈ ఒప్పందం ద్వారా భారత రైతులు, యువత, సేవల రంగంలోని నిపుణులకు ప్రపంచ మార్కెట్లలో గణనీయమైన అవకాశాలు లభిస్తాయని విశ్వాసం వ్యక్తం చేశారు.

* **వికసిత్ భారత్ లక్ష్య సాధనలో బడ్జెట్ సమావేశాలు కీలకం: ప్రధాని**

2047 నాటికి 'వికసిత్ భారత్' సాధించాలనే సంకల్పంలో ఈ బడ్జెట్ సమావేశాలు ఒక ముఖ్యమైన అడుగు అని ప్రధాని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం 'రిఫార్మ్ ఎక్స్‌ప్రెస్'పై వేగంగా ముందుకు సాగుతోందని, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలకు శాశ్వత పరిష్కారాలు చూపుతోందని తెలిపారు. తమ ప్రభుత్వ పనితీరు "సంస్కరణ, పనితీరు, పరివర్తన" అనే సూత్రంపై ఆధారపడి ఉంటుందని స్పష్టం చేశారు. టెక్నాలజీని అందిపుచ్చుకుంటూనే, మానవతా దృక్పథాన్ని విస్మరించబోమని, చిట్టచివరి వ్యక్తి వరకు లబ్ధి చేకూరేలా చూస్తామని హామీ ఇచ్చారు.

* **వరుసగా 9వ బడ్జెట్.. నిర్మలా సీతారామన్‌పై మోదీ ప్రశంసలు**

అలాగే, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వరుసగా తొమ్మిదోసారి బడ్జెట్ ప్రవేశపెట్టడం దేశ పార్లమెంటరీ చరిత్రలో ఒక గర్వకారణమైన క్షణమని అభివర్ణించారు. అంతకుముందు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పార్లమెంటులో చేసిన ప్రసంగం 140 కోట్ల మంది భారతీయుల ఆత్మవిశ్వాసాన్ని, ఆకాంక్షలను ప్రతిబింబించిందని కొనియాడారు. దేశాభివృద్ధిని వేగవంతం చేసేందుకు ఎంపీలందరూ నిర్మాణాత్మక చర్చల్లో పాల్గొనాలని ప్రధాని కోరారు.

## కేసీఆర్ కు నోటీసులు అందించిన సిట్..

తెలంగాణ రాజకీయాల్లో ప్రకంపనలు పుట్టిస్తున్న ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ కు నోటీసులు అందాయి. హైదరాబాద్ లోని నందినగర్ లో ఉన్న కేసీఆర్ నివాసానికి వెళ్లిన సిట్ అధికారులు నోటీసులు అందించారు. రేపు మధ్యాహ్నం 3 గంటలకు విచారణ జరుపుతామని నోటీసుల్లో సిట్ అధికారులు పేర్కొన్నారు. కేసీఆర్ వయసు దృష్ట్యా విచారణ కోసం పోలీస్ స్టేషన్ కు రావాల్సిన అవసరం లేదని సిట్ తెలిపింది. హైదరాబాద్ నగర పరిధిలోని ఏదైనా ప్రాంతం వివరాలను తెలిపితే... అక్కడకే వచ్చి విచారణ జరుపుతామని పేర్కొంది. ఇప్పటికే ఈ కేసులో కేటీఆర్, హరీశ్ రావు, సంతోష్‌కుమార్ లను సిట్ విచారించింది. మళ్లీ అవసరమైతే విచారణకు పిలుస్తామని వారికి తెలియజేసింది. ఇప్పుడు గులాబీ బాస్ ను విచారణకు పిలవడంతో ఆ పార్టీలో ఉత్కంఠ నెలకొంది. రాబోయే రోజుల్లో ఈ కేసులో మరెన్ని మలుపులు చోటుచేసుకుంటాయో అనే ఆసక్తి సర్వత్ర నెలకొంది.



## పసిడి, వెండి ధరలకు రెక్కలు.. ఆల్ టైమ్ రికార్డ్

ఢిల్లీ: అంతర్జాతీయంగా నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో బంగారం, వెండి ధరలు ఇవాళ రికార్డు స్థాయికి చేరాయి. ఇరాన్‌పై సైనిక చర్యకు దిగుతామంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించడంతో సురక్షితమైన పెట్టుబడిగా భావించే బంగారం వైపు ఇన్వెస్టర్లు భారీగా మొగ్గుచూపారు. దీంతో పసిడి, వెండి ధరలు ఆల్‌టైమ్ గరిష్ఠాన్ని తాకాయి. భారత మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (MCX)లో ఈరోజు ఉదయం 10.45 గంటల సమయంలో ఫిబ్రవరి గోల్డ్ ఫ్యూచర్స్ ధర 5.99 శాతం పెరిగి 10 గ్రాములకు రూ. 1,75,885కి చేరింది. అదేవిధంగా మార్చి సిల్వర్ ఫ్యూచర్స్ 4.24 శాతం వృద్ధితో కిలోకు రూ. 4,01,699 పలికింది. అంతర్జాతీయ మార్కెట్లలోనూ ఇదే ధోరణి కనిపించింది. యూఎస్ డాలర్ బలహీనపడటం, వివిధ దేశాల సెంట్రల్ బ్యాంకులు పెద్ద ఎత్తున బంగారాన్ని కొనుగోలు చేస్తుండటం కూడా ఈ ర్యాలీకి కారణమైంది.

## 14వ వార్డు బిజెపి కౌన్సిలర్ అభ్యర్థిగా మార్గం పూజ శివకృష్ణ యాదవ్ నామినేషన్



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం 14వ వార్డ్ బిజెపి కౌన్సిలర్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన మార్గం పూజ శివకృష్ణ యాదవ్ గురువారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా మార్గం పూజ శివకృష్ణ యాదవ్ మాట్లాడుతూ 14వ వార్డు నుంచి తనను ఆదరించి ఆశీర్వదించాలని కోరారు. వార్డు అభివృద్ధికి శక్తివంతురాలు లేకుండా కృషి చేస్తానన్నారు.

## రెండో రోజు భారీగా నామినేషన్లు

* **నల్లగొండలో రెండవ రోజు 156 నామినేషన్లు దాఖలు**



ప్రజాస్ఫూర్తి నల్లగొండ: నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ లోని వివిధ వార్డులకు రెండవ రోజు గురువారం వివిధ పార్టీలకు చెందిన 156 మంది నామినేషన్లను దాఖలు చేశారు. భారతీయ జనతా పార్టీ (బీజేపీ) 21నామినేషన్లు, భారత జాతీయ కాంగ్రెస్ (ఐఎన్సీ) 67నామినేషన్లు, భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) 29నామినేషన్లు, ఎంఐఎం 1, అమ్ ఆద్మీ పార్టీ 1, సిపిఎం 1, ఇండిపెండెంట్ అభ్యర్థులు 20నామినేషన్ దాఖలు చేయగా మొత్తం నామినేషన్లు 156 దాఖలు చేశారు. నామినేషన్ల కేంద్రం వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేసి కట్టుదిట్టమైన చర్యలు తీ సుకున్నారు.

## కలిసికట్టుగా గ్రామాన్ని అభివృద్ధి చేసుకుందాం



అందోలు, ప్రజాస్ఫూర్తి: కలిసికట్టుగా గ్రామాన్ని అభివృద్ధి చేసుకుందామని మేడికుండా సర్పంచ్ నాలచెరు చంద్రకళ అన్నారు. గురువారం గ్రామ సర్పంచ్ నాలచెరు చంద్రకళ ఆధ్వర్యంలో మొదటి గ్రామసభ ను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధిలో భాగంగా గ్రామంలోని సమస్యలను గుర్తించి చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించారు. ముఖ్యంగా త్రాగు నీరు సమస్యలు , త్రాగు నీరు విడిచే మనిషి గూర్చి , మురికి కాలువల శుభ్రత, చెత్తను విచ్చల విడిగా వే యకుండా నియంత్రణ, పల్లె ప్రకృతి లోని బోర్ బావిని సదుపయోగం , నర్సరీ సక్రమంగా నిర్వహణ మరియు స్థలం మార్చుట గూర్చి , విద్యుత్ లైట్స్, గ్రామంలోని యు. కే. జి వయసు ఉన్న పిల్లలు కొత్తగా ప్రారంభం అయిన ప్రీప్రైమరి పాఠశాలలో పంపుట గూర్చి , పాఠశాలలో మొరం ఏర్పాటు , పానాది దారుల వెంట మొరం , పంచాయతి భవనం దగ్గర రెండు స్థంబాల మధ్య కరెంటు తీగ వేయడం వంటి పనులను చేసేందుకు తీర్మానించారు. ప్రతి సమస్యను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకునేందుకు ప్రజలందరూ సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో రాయికోడ్ ఆత్మ కమిటీ చైర్మన్ కచూర్ రావు, ఉపసర్పంచ్ కరేనోళ్ళ నిర్మల , వార్డ్ సభ్యులు, ఫీల్డ్ అసిస్టెంట్ సంగమేశ్వర్ , మాజీ యంపిటిసి శంకరప్ప, మాజీ సర్పంచ్ నాగయ్య, విట్టల్, సార ప్రవీణ్ గౌడ్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## జోగిపేట 15వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థిగా చిట్టిబాబు



అందోలు, ప్రజాస్ఫూర్తి: అందోలు -జోగిపేట మున్సిపాలిటీ పరిధిలోని అధికార కాంగ్రెస్ పార్టీలో కౌన్సిలర్ అభ్యర్థుల ఎంపిక ఉత్కంఠ భరిత మైన వాతావరణం మధ్య ఎట్టకేలకు జరిగింది. మున్సిపాలిటీలో 20 వార్డులుండగా 16 వార్డుల అభ్యర్థుల ఖరారు అయ్యాయి. మాజీ కౌన్సిలర్ ఎ.చిట్టిబాబు 15వ వార్డు నుంచి పోటీ చేయాలని నిర్ణయం తీసుకున్నారు. కానీ మంత్రి మాత్రం ఇక్కడ మైనార్టీలకు ఇచ్చేందుకు మొగ్గు చూపుతున్నట్లు ప్రచారం జరిగింది. చివరికి పార్టీకి పదేళ్లుగా సేవలను అందించిన చిట్టిబాబుకే మంత్రి దామోదర రాజనర్సింహ మొగ్గు చూపారు. 14,17 వార్డుల్లో అభ్యర్థుల ఎంపిక భాధ్యతను కూడా ఆయనకే అప్పగించారు. మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా న్యాయవాది ఎస్.కిష్టారెడ్డి పేరును కాంగ్రెస్ ప్రకటించింది. ఆయన 20వ వార్డు నుంచి పోటీకి దిగనున్నారు. నామినేషన్ల చివరి రోజున అధికార కాంగ్రెస్ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయనున్నారు. ముఖ్యంగా చిట్టిబాబు అభ్యర్థిత్వం ఖరారుపై పట్టణంలో చర్చనీయాంశమైంది.

## బివిఆర్ ఐటి కళాశాలలో ప్రతిష్టాత్మకమైన ఎంబాజా 2026 పోటీలు





ఫిబ్రవరి 25 నుంచి మార్చి 1 వరకు కుదిరిన ఎం.ఓ.యూ.బివిఆర్ రాజు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో ఫిబ్రవరి 25 నుంచి మార్చి 1 వరకు ఎంబాజా ఎస్ఏఈఇండియా 2026 పోటీలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు గురువారం నర్సాపూర్‌లోని బివిఆర్ ఐటి కళాశాలలో ఎంబాజ సోసైటి ఆఫ్ ఆటోమెటివ్ ఇంజనీర్స్ ఇండియా, శ్రీ విష్ణు ఎడ్యుకేషనల్ సోసైటీల మధ్య అంగీకార ఒప్పందం కుదిరింది. ఈ సందర్భంగా బివిఆర్ ఐటి హైదరాబాద్ ప్రిన్సిపాల్ డాక్టర్ కెవిఎన్ సునీత మాట్లాడుతూ హ్యాండ్స్ ఆన్ లెర్నింగ్, ఆవిష్కరణ ఆధారిత విద్య, పరిశ్రమలతో సహకరమే తమ సంస్థ విద్యా తత్వమని పేర్కొన్నారు. ఈ పోటీలలో దేశ వ్యాప్తంగా ఇంజనీరింగ్ విద్యార్థులు అన్ని భూబాగాలలో ప్రయాణించే వాహనాలు రూపకల్పన, తయారీ నైపుణ్యాలను ప్రదర్శించనున్నారని తెలిపారు. ఈ పోటీల ద్వారా విద్యార్థులకు వాస్తవ ప్రపంచ ఇంజనీరింగ్ సవాళ్లను ఎదుర్కొనే అమూల్యమైన అవకాశం లభిస్తోందని ఆశాభావం వ్యక్తం చేశారు. పోటీలను సద్భవమైన వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని విధాలుగా సహకారం అందిస్తామన్నారు. శ్రీ విష్ణు ఎడ్యుకేషనల్ సోసైటీ వైస్ చైర్మెన్ రవిచంద్రన్ రాజగోపాల్ మాట్లాడుతూ జాతీయ స్థాయి ఎంబాజా కార్యక్రమాన్ని నిర్వహించడం గర్వకారణమన్నారు. ఎంబాజా ఎస్ఏఈఇండియా ఆర్గనైజింగ్ కమిటీ చైర్మెన్ బాలరాజు సుబ్రహ్మణం మాట్లాడుతూ 2007లో ప్రారంభమైన ఈ పోటీలు ఇప్పుడు దేశవ్యాప్తంగా ప్రధానమైన ఇంజనీరింగ్ ఈవెంట్‌గా మారిందని తెలిపారు. భవిష్యత్ మొబిలిటి సవాళ్లను ఎదుర్కొనేలా విద్యార్థుల్లో సాంకేతిక, సహకార నైపుణ్యాలను పెంపొందించడంలో ఈపోటీలు ఎంతగానో దోహదపడుతాయన్నారు. కార్యక్రమంలో శ్రీ విష్ణు ఎడ్యుకేషనల్ సోసైటీ డైరెక్టర్ పి.శ్రీనివాస్ రాజు, ఎంబాజా 2026కన్వీనర్ అలీ సయ్యద్, బివిఆర్ ఐటి నర్సాపూర్ కళాశాల ప్రినిపాల్ డాక్టర్ సంజేయ్ దూబె తదితరులు పాల్గొన్నారు.



కార్మికులు తమ అరోగ్యాలను కాప్పాడుకోవాలని

## మల్కాజిగిరి జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్

* **పారిశుద్ధ్య కార్మికులకు సర్వైకల్ బ్రెస్ట్ క్యాన్సర్ పరీక్షలు**

మల్కాజిగిరి, ప్రజాస్ఫూర్తి : కర్కినోస్ ఇండియన్ క్యాన్సర్ సొసైటీ , ఒరాకిల్ సంస్థలు ఆధ్వర్యంలో జిహెచ్ఎంసి పారిశుధ్య కార్మికులకు ఉచిత సర్వైకల్ బ్రెస్ట్ క్యాన్సర్ ఓరల్ స్క్రీనింగ్ పరీక్షలను గురువారం నిర్వహించారు. మల్కాజిగిరి జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్ ఉచిత హెల్త్ క్యాంపును ప్రారంభించారు. మల్కాజిగిరి, అల్వాల్, మౌలాలి సర్కిళ్ళ పరిధిలో పనిచేస్తున్న మహిళా కార్మికులకు ఈ ముందస్తు క్యాన్సర్ పరీక్షలను చేశారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ మాట్లాడుతూ కర్కినోస్ ఇండియన్ క్యాన్సర్ సొసైటీ , ఒరాకిల్ సంస్థలు ముందుకు వచ్చి జిహెచ్ఎంసి కార్మికులకు వైద్య పరీక్షలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ఉచిత వైద్య శిబిరాన్ని జిహెచ్ఎంసి సిబ్బంది అందరూ ఉపయోగించుకోవాలని సూచించారు. ఎవరికైనా పాజిటివ్ ఉన్నట్లయితే ఇట్టి సంస్థలు వ్యాధి వ్యాప్తి జరగకుండా నిరోధించడానికి పూర్తి స్థాయిలో నయం అయ్యేంత వరకు ఉచిత వైద్య సేవలు అందిస్తారని తెలిపారు. పారిశుధ్య కార్మికులు ఆరోగ్యంగా ఉంటేనే సమాజం ఆరోగ్యంగా ఉంటుందని అందుకు వారి ఆరోగ్య పరిరక్షణకై జిహెచ్ఎంసికమిషనర్ ఆదేశానుసారము హెల్త్ క్యాంపు నిర్వహించడం జరిగిందన్నారు. కార్మికులు మద్యం, పొగాకు, సిగరెట్లు, గుట్కా, తంబాకు వంటి వ్యసనాలకు బానిస కారాదని కోరారు. అపరిశుభ్రమైన వాతావరణంలో విధులు నిర్వహించి కార్మికులు తమ ఆరోగ్య సమస్యలు రాకుండా హెల్త్ చెక్ చేయించుకోవాలని వ్యసనాలకు బానిసలు కావొద్దని తెలిపారు. కార్మికులు ఎక్కువ శాతం పేదరికం నుంచి వచ్చిన వారు ఉన్నందున వారి ఆరోగ్యం పై శ్రద్ధ కనబరచాలని అనారోగ్యం కు గురి అయినట్లయితే కుటుంబం ఇంకా ఆర్థికంగా వెనుకబడిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిహెచ్ఎంసి ముఖ్య ఆరోగ్య అధికారి పద్మజ జిహెచ్ఎంసి వారు మాట్లాడుతూ జిహెచ్ఎంసి పరిధిలో అందరూ కార్మికులకు బ్రెస్ట్ క్యాన్సర్ ఓరల్ స్క్రీనింగ్ పరీక్షలు దశలవారీగా నిర్వహించుచున్నట్లు తెలిపారు. ఫిబ్రవరి చివరి వారంలో కార్మికుల అందరికీ మరొకసారి స్క్రీనింగ్ టెస్ట్ లు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సర్కిల్ వైద్యాధికారిణి డాక్టర్ కే మంజుల, మౌలాలి డిప్యూటీ కమిషనర్ గోపాల్ రావు, అధికారులు చింత శ్రీనివాస్, కిరణ్, భాస్కరరావు, గోవిందమ్మ, వెంకటేష్, గిరి తదితరులు పాల్గొన్నారు.

## నామినేషన్ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించాలి

* **చౌటుప్పల్ మున్సిపల్ నామినేషన్ల ప్రక్రియను ఆకస్మికంగా తనిఖీ**
* **యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: అభ్యర్థులు దాఖలు చేసిన ప్రతి నామినేషన్ పత్రాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు సూచించారు. చౌటుప్పల్ మున్సిపాలిటీ రెండవ సాధారణ ఎన్నికల ప్రక్రియలో భాగంగా స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ ఎం. హనుమంతరావు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. నామినేషన్ల స్వీకరణ కోసం ఏర్పాటు చేసిన రిజిస్టర్లను, అభ్యర్థులు సమర్పించిన పత్రాలను కలెక్టర్ రిటర్నింగ్ అధికారుల దగ్గర క్షుణ్ణంగా పరిశీలిస్తు, రిటర్నింగ్ అధికారులతో చర్చించారు. ఎన్నికల కమిషన్ జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం ప్రక్రియ జరుగుతుందా అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. నామినేషన్ల పర్వం ముగిసే వరకు ప్రతి అభ్యర్థికి సమాన అవకాశం కల్పిస్తూ, ఎటువంటి గందరగోళం లేకుండా చూడాలని కమిషనర్ జి. వెంకట్రామ్ రెడ్డిని ఆదేశించారు. నామినేషన్ల స్వీకరణ కేంద్రం వద్ద సి.సి. కెమెరాల నిఘా, పోలీస్ బందోబస్తుపై ఆర్.డి.ఓ. శేఖర్ రెడ్డితో చర్చించి, శాంతిభద్రతల విషయంలో కఠినంగా ఉండాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ జి. వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు అభ్యర్థుల కోసం అన్ని మౌలిక వసతులు, కంట్రోల్ రూమ్, సహాయ కేంద్రం (హెల్ప్ డెస్క్) కల్పించామని, నామినేషన్ల స్వీకరణ సజావుగా సాగుతోందని వివరించారు. ఈ తనిఖీలో ఈ తనిఖీలో కలెక్టర్ వెంట చౌటుప్పల్ ఆర్డివో శేఖర్ రెడ్డి, ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, మున్సిపల్ మేనేజర్ శ్రీధర్ రెడ్డి, ఆర్వో అంజయ్య, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## కొత్తగూడెం మున్సిపల్ ఎన్నికల ఫిర్యాదుల కోసం ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: మున్సిపల్ ఎన్నికలు-2026ను పారదర్శకంగా, శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు జిల్లా కేంద్రంలోని ఐడీఓసి కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తెలిపారు. మున్సిపల్ ఎన్నికలకు సంబంధించిన మీడియా సెల్ సమాచారం, ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనలు, ఎంసీఎంసీ అంశాలు మరియు ఇతర ఎన్నికల ఫిర్యాదులపై ప్రజలు కంట్రోల్ రూమ్ నంబర్ 9381082501ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు. ఈ కంట్రోల్ రూమ్‌లో 24 గంటల పాటు సిబ్బంది అందుబాటులో ఉండి, అందిన ప్రతి ఫిర్యాదును రిజిస్టర్‌లో నమోదు చేసి, సంబంధిత అధికారుల ద్వారా తక్షణమే తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లాలో మున్సిపల్ ఎన్నికలను ప్రశాంతంగా, నిబంధనల మేరకు నిర్వహించేందుకు ఎన్నికల సంఘం మార్గదర్శకాలను కట్టుదిట్టంగా అమలు చేస్తూ, అన్ని శాఖల అధికారులతో సమన్వయంతో అవసరమైన చర్యలు చేపడతామని కలెక్టర్ జితేష్ వి. పాటిల్ స్పష్టం చేశారు.

## సంగారెడ్డి మున్సిపాలిటీ కాంగ్రెస్ అభ్యర్థులు జాబితా విడుదల

* **వెల్లడించిన నిర్మలజగ్గారెడ్డి**
* **3 వార్డులు పెండింగ్**



సంగారెడ్డి,ప్రజాస్ఫూర్తి 29: సంగారెడ్డి మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల జాబితాను వెల్లడించారు.జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి ఆధ్వర్యంలో అభ్యర్థుల వివరాలు ప్రకటించారు..సంగారెడ్డి మున్సిపాలిటీలో మొత్తం 38 వార్డులు ఉండగా, 4, 22, 33వ వార్డులు మినహా మిగిలిన 36 వార్డుల అభ్యర్థుల పేర్లను వెల్లడించారు.1వ వార్డు కుమ్మరి కృష్ణ,2వ వార్డు ఆవుల సునీత, 3వ వార్డు నందనాయకుల కుమార్, 4వ వార్డు పెండింగ్, 5వ వార్డు బీబీ పూర్నూర్ జహాన్, 6వ వార్డు ఎండీ ఖాజా నవాజుద్దీన్, 7వ వార్డు వంశీ కృష్ణ,8వ వార్డు భూమేష్,9వ వార్డు శ్రీలత శ్రీశైలం, 10వ వార్డు శైలేందర్ రెడ్డి,11వ వార్డు గడ్డం తులసి రామ్,12వ వార్డుప్రవీణ్ (సీఎస్ఐ),13వ వార్డు బేగరి వీణా కుమారి,14వ వార్డు భవాని శంకర్,15వ వార్డు దన్నారం సుష్మిత, 16వ వార్డు శాంతి,17వ వార్డు జ్యోతి,18వ వార్డు యశస్విని,19వ వార్డు గుర్రం ఝాన్సీ,20వ వార్డు అనీస్ సుల్తానా (మోతే శ్యామ్), 21వ వార్డు తోపాజీ వీణా హరీష్, 22వ వార్డు పెండింగ్,23 కూన వనిత, 24 ఉల్ఫత్ సుల్తానా,25అయేషా సుల్తానా,26 షేక్ షఫీ హాఫీజ్27ఎం. శిరీష శశికాంత్,28జీ. సంగీత మహేష్,29నీరుడి మీన,30 మనీష,31 జగ్గరి సతీష్ రెడ్డి,32వజగ్గరి రమ్యశ్రీ,33 పెండింగ్, 34 రిజ్వానా బేగం (అద్దు),35కడమంచి నర్సమ్మ,36సాతెల్లి మాధురి,37జార్జ్ మాథ్యూ,38నదీమ్ గా ప్రకటించారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత కిషన్, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆంజనేయులు, పట్టణ అధ్యక్షుడు జార్జ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రఘు గౌడ్, సీనియర్ నాయకులు బొంగుల రవి, కూన సంతోష్, కిరణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## భారీ ర్యాలీతో.. నామినేషన్లు వేసిన బిజెపి అభ్యర్థులు

**- 3వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా దీపిక శంకరయ్య**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: బిజెపి పార్టీ నుంచి చౌటుప్పల్ మున్సిపల్ పరిధిలో మున్సిపల్ ఎన్నికల సందర్భంగా 20వార్డుల గాను రెండవ వార్డు అభ్యర్థిగా పోలేపల్లి లక్ష్మీ ముత్తయ్య, మూడో వార్డు అభ్యర్థిగా రమణ గోని దీపిక శంకరయ్యలు గురువారం నామినేషన్లు దాఖలు చేశారు. అంతకుముందు మున్సిపల్ పరిధి లింగోజిగూడెం గ్రామంలో ఆంజనేయ స్వామి గుడి వద్ద నుంచి పెద్ద ఎత్తున ప్రజల తోటి ర్యాలీగా బయలుదేరి చౌటుప్పల రామాలయానికి చేరుకున్నారు. శ్రీరాముడు ఆశీస్సులు తీసుకున్నారు. సుమారు 500మంది మహిళలతో కార్యకర్తలతో నామినేషన్ దాఖలు చేశారు. వివిధ వార్డుల్లో బిజెపి అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షురాలు కడారి కల్పన యాదవ్, రమణగోని శంకరయ్య, ముత్యాల భూపాల్ రెడ్డి, గుజ్జుల సురేందర్ రెడ్డి, పోలోజు శ్రీధర్ బాబు, సురేందర్ రెడ్డి, ఊడుగు వెంకటేశం గౌడ్, దాసోజు బిక్షమాచారి, తడక సురేఖ, గోశిక నీరజ, వనం ధనంజయ, కడారి ఐలయ్య, ఎడ్ల మహేశ్వర్ రెడ్డి, పుర ప్రముఖులు మహిళలం కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# రూ. 7.96 కోట్ల 1592 కేజీల గంజాయి దహనం

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: జిల్లాలోని ఎనిమిది పోలీస్ స్టేషన్లలో నమోదైన 13 కేసుల్లో వివిధ సందర్భాల్లో స్వాధీనం చేసుకున్న 1592 కేజీల నిషేధిత గంజాయిని జిల్లా డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో దహనం చేశారు. తల్లాడ మండలం గోపాలపేటలోని బయో డిస్పోజల్ ప్లాంట్‌లో పర్యావరణ కాలుష్య నియంత్రణ నిబంధనలు పాటిస్తూ బుధ, గురువారాల్లో రెండు రోజుల పాటు ఈ ప్రక్రియ నిర్వహించారు. దహనం చేసిన గంజాయి విలువ సుమారు రూ.7 కోట్ల 96 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు. జిల్లా డ్రగ్ డిస్పోజల్ కమిటీ చైర్మన్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజు సూచనలతో సభ్యుడు



పాల్వంచ డీఎస్పీ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో కోర్టు అనుమతితో గంజాయిని దశల వారీగా దహనం చేశారు. ఎన్‌డీపీఎస్ చట్టంలోని నిబంధనల మేరకు జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్లలో నిల్వ ఉన్న మత్తు పదార్థాలను నిర్వీణ చేసినట్లు ఎస్పీ వెల్లడించారు.

అక్రమంగా గంజాయి విక్రయిస్తూ యువతను మత్తుకు గురి చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇటువంటి కార్యకలాపాలను అరికట్టేందుకు జిల్లా వ్యాప్తంగా రహస్య బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మత్తు పదార్థాల విక్రయం లేదా వినియోగంలో పాల్గొన్న వారిపై కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తామని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో పాల్వంచ డీఎస్పీ సతీష్ కుమార్, డీసీఆర్‌బీ సీఐ శ్రీనివాస్ తదితర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# కొలువైన సమ్మక్క

**(ప్రజాస్ఫూర్తి, ములుగు) : ఆసియాలో అతి పెద్ద జాతర శ్రీ మేడారం సమ్మక్క సారలమ్మ జాతరలో నిన్న రాత్రి సారలమ్మ గద్దెకు చేరగా నేడు సమ్మక్క తల్లి చిలుకల గుట్ట నుండి గద్దెల వద్దకు చేరుకోనుంది. సమ్మక్క రాక సందర్భంగా ముందుగా వనం (వెదురు కరల్లను) గద్దె పై ప్రతిష్టించారు. జాతరలో వనం ( వెదురు) కు విశిష్టత ఉంది. వనం అంటే ఆదివాసీ భాషలో అడవి అని అర్థం. ఈ వనం నుంచి తల్లులు గద్దెల పైకి వస్తారు కాబట్టి ముందుగా ఏపుగా ఎరిగిన వెదురు కర్ర లను ఆదివాసీ సంప్రదాయం ప్రకారం ప్రత్యేక పూజలు నిర్వహించి సమ్మక్క గద్దె వద్దకు తీసుకు వచ్చి గద్దె పై ప్రతిష్టిస్తారు. వనం (వెదురు) తీసుకు వచ్చిన తరువాత చిలుకల గుట్ట నుండి సమ్మక్క ను తీసుకువచ్చారు.**





మేడారంలో వనవదేవతలను దర్శించుకున్న కేంద్రమంత్రులు ఓరా, కిషన్ రెడ్డి



మేడారం చిలకలగుట్ట నుండి. 6 గంటల..15 నిమిషాలకు గద్దెల మీదకి సమ్మక్క బయలు దేరింది. ములుగు జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాద్ కేకన్ గాలిలోకి కాల్పులు జరిపి స్వాగతం పలికారు.







మేడారంలో వనవదేవతలను దర్శించుకున్న ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క దంపతులు, టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ దంపతుల







# మామునూరుకు మోక్షం.. తెలంగాణ విమానయాన రంగంలో కొత్త శకం

* **ఇది చరిత్రలో నిలిచిపోయే రోజు: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**
* **ఆదిలాబాద్, కొత్తగూడెం ఎయిర్పోర్ట్ పనులూ వేగవంతం చేయాలని విజ్ఞప్తి**
* **'వింగ్స్ ఇండియా 2026'లో తెలంగాణ విజన్‌ను ఆవిష్కరించిన ఉపముఖ్యమంత్రి**




తెలంగాణ విమానయాన రంగ చరిత్రలో గురువారం ఒక కీలక ఘట్టం ఆవిష్కృతమైంది. వరంగల్ జిల్లాలోని మామునూరు ఎయిర్పోర్ట్ పునరుద్ధరణ కోసం ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న 300 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా కేంద్ర విమానయాన శాఖకు అప్పగించింది. బేగంపేట విమానాశ్రయంలో జరిగిన ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు పాల్గొన్నారు.

మామునూరు ఎయిర్‌పోర్ట్: ఒక చారిత్రక ముందడుగు

ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ, ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే మామునూరు ఎయిర్‌పోర్ట్ ప్రాముఖ్యతను గుర్తించి, భూసేకరణ కోసం రూ. 300 కోట్లు విడుదల చేశామని తెలిపారు. "ఈరోజు కేంద్ర వైమానిక శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుకు 300 ఎకరాల భూమిని అప్పగించడం చరిత్రలో నిలిచిపోయే రోజు," అని భట్టి వ్యాఖ్యానించారు. నిజాం కాలంలోనే (1930) ప్రారంభమైన మామునూరు ఎయిర్ పోర్ట్, ఒకప్పుడు దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద ఎయిర్‌పోర్ట్‌గా వెలుగొందిందని గుర్తుచేశారు. గత పదేళ్ల పాలనలో నిర్లక్ష్యం వల్లే 2007లో ఒప్పందం జరిగినప్పటికీ పనులు ముందుకు సాగలేదని విమర్శించారు.

* **కొత్తగూడెం, ఆదిలాబాద్‌లకు విమాన సేవలు**

హైదరాబాద్‌కు పరిమితం కాకుండా, రాష్ట్రంలోని టైర్ 2 నగరాలైన కొత్తగూడెం, ఆదిలాబాద్‌లలో కూడా విమానాశ్రయాల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని కేంద్ర మంత్రిని కోరినట్లు భట్టి తెలిపారు. తెలుగు వ్యక్తి కేంద్ర వైమానిక శాఖ మంత్రిగా ఉండటం గర్వకారణమని, రాష్ట్ర అభివృద్ధికి వారు సహకరించాలని కోరారు.

* **వింగ్స్ ఇండియా 2026: గ్లోబల్ హబ్‌గా తెలంగాణ**

అనంతరం 'వింగ్స్ ఇండియా 2026' ఎయిర్ షో సదస్సులో పాల్గొన్న డిప్యూటీ సీఎం, విమానయాన రంగంలో తెలంగాణ భవిష్యత్తు ప్రణాళికలను వివరించారు.

>> లోకల్ టు గ్లోబల్: భారతదేశం ఇప్పుడు కేవలం విమానాలను కొనుగోలు చేసే దేశం మాత్రమే కాదని, తయారీదారులుగా, నిర్వహణ నిపుణులుగా ఎదుగుతోందని అన్నారు. ఈ మార్పులో తెలంగాణ కీలక పాత్ర పోషిస్తోందన్నారు.

>> కాంగ్రెస్ దూరదృష్టి వైఎస్సార్ మార్క్: 1990ల ఆర్థిక సంస్కరణలు, 20042014 మధ్య కాంగ్రెస్ ప్రభుత్వాల చొరవతోనే విమానయాన రంగం ఈ స్థాయికి చేరిందని భట్టి గుర్తుచేశారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలోనే శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి బీజం పడిందని, అదే నేడు హైదరాబాద్‌ను గ్లోబల్ హబ్‌గా నిలబెట్టిందని తెలిపారు. మౌలిక సదుపాయాలు అనేవి ఒక ప్రభుత్వ కాలానికి కాకుండా, తరతరాల కోసం నిర్మించబడతాయని వ్యాఖ్యానించారు.

>> 2047 లక్ష్యం తెలంగాణ విజన్: తెలంగాణను ఏరో ఇంజిన్ మరియు MRO హబ్‌గా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని భట్టి స్పష్టం చేశారు.

>> నైపుణ్యం: ప్రపంచవ్యాప్తంగా ఎగిరే విమానాల్లో హైదరాబాద్ ఇంజినీర్లు తయారు చేసిన భాగాలు ఉండటం గర్వకారణం.

>> స్థిరత్వం: హైదరాబాద్ ఎయిర్పోర్ట్ ఇప్పటికే 100% పునరుత్పాదక శక్తితో నడుస్తోందని, భవిష్యత్తులో గ్రీన్ ఏవియేషన్‌కు తెలంగాణ నాయకత్వం వహిస్తుందని తెలిపారు.

>> గ్రామీణ అనుసంధానం: మంచి రోడ్లు గ్రామాలను పట్టణాలతో కలిపితే, మంచి విమానాశ్రయాలు కలలను గమ్యస్థానాలతో కలుపుతాయని భట్టి చమత్కరించారు.

చివరగా, పెట్టుబడిదారులకు తెలంగాణలో స్థిరమైన, పారదర్శకమైన పాలన అందుతుందని హామీ ఇస్తూ, గ్లోబల్ ఏవియేషన్ రంగంలో భాగస్వాములుగా కలిసి రావాలని పిలుపునిచ్చారు.

## మున్సిపల్ ఎన్నికలు..
### స్క్రీనింగ్ కమిటీలను నియమించిన కాంగ్రెస్

హైదరాబాద్: తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల సందడి మొదలైంది. మరికొన్ని రోజుల్లో జరగనున్న మున్సిపల్ ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ.. పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా స్క్రీనింగ్ కమిటీలను ఏర్పాటు చేసింది. ఈ మేరకు టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ స్క్రీనింగ్ కమిటీ ఛైర్మన్ల పేర్లను ఖరారు చేశారు.



* **పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా స్క్రీనింగ్ కమిటీల ఛైర్మన్లు వీరే**

>> ఆదిలాబాద్ ప్రభుత్వ సలహాదారు పి. సుదర్శన్‌రెడ్డి
>> పెద్దపల్లి మంత్రి జూపల్లి కృష్ణారావు
>> కరీంనగర్ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
>> నిజామాబాద్ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
>> జహీరాబాద్ మంత్రి అజారుద్దీన్
>> మెదక్ మంత్రి గడ్డం వివేక్
>> మల్కాజిగిరి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి
>> చేవెళ్ల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు
>> మహబూబ్ నగర్ మంత్రి దామోదర్ రాజనర్సింహ
>> నాగర్ కర్నూల్ మంత్రి వి. శ్రీహరి
>> నల్గొండ మంత్రి అడ్లూరి లక్ష్మణ్
>> భువనగిరి మంత్రి డి.అనసూయ (సీతక్క)
>> వరంగల్ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

మహబూబాబాద్ మంత్రి పొన్నం ప్రభాకర్
ఖమ్మం మంత్రి కొండా సురేఖ

ప్రతి స్క్రీనింగ్ కమిటీలో ముగ్గురు నుంచి నలుగురు కన్వీనర్లుగా ఆ నియోజకవర్గంలోని ముఖ్యమైన నాయకులు, ఎమ్మెల్యేలను భాగస్వాములను చేయాలని పీసీసీ నిర్ణయించింది. ఆ నియోజకవర్గంలోని ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ ఛైర్మన్లు, ఇన్‌ఛార్జి పీసీసీ ఆఫీసు బేరర్లు, పీసీసీ ఆఫీస్ బేరర్లు సభ్యులుగా ఉంటారని పేర్కొంది. ఫ్రంట్ ఆర్గనైజేషన్లు ఓబీసీ, ఎస్సీ, ఆదివాసీ, మైనారిటీ విభాగాలకు చెందిన వారు ప్రత్యేక ఆహ్వానితులుగా కమిటీలో ఉంటారని తెలిపింది.

## కేసీఆర్‌కు నోటీసులు.. ఇది విచారణ కాదు.. ప్రతీకారం

**: కేటీఆర్**

హైదరాబాద్: భారత రాష్ట్ర సమితి అధినేత కేసీఆర్‌కు ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ నోటీసులు ఇవ్వడంపై ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ మండిపడ్డారు. కక్ష సాధింపు రాజకీయాలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ఇది విచారణ కాదని, ప్రతీకారమని, రాజకీయ దురుద్దేశమని విమర్శించారు. సుదీర్ఘ ఉద్యమం చేసి తెలంగాణను సాధించిన మహానాయకుడు కేసీఆర్ అని అన్నారు. ఈ మేరకు 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. "సాధించిన తెలంగాణను పదేళ్ల తన పాలనతో ప్రపంచానికి చాటి చెప్పిన నాయకుడు కేసీఆర్. వివిధ పథకాలతో తెలంగాణను అభివృద్ధి పథంలో నడిపిన గొప్ప విజనరీ. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం.. అడ్డగోలు హామీలు ఇచ్చి, అబద్ధాల పునాదుల మీద అధికారంలోకి వచ్చి.. ఏడాదిలోనే ప్రజల నోట్లో మట్టి కొట్టి, ఇచ్చిన హామీల అమలులో పూర్తిగా విఫలమైంది. వారి వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు, పాలనా లోపాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు.. ఇప్పుడు విచారణల పేరుతో కేసీఆర్‌కు నోటీసులు ఇవ్వడం అత్యంత దుర్మార్గమైన కక్షసాధింపు రాజకీయానికి నిదర్శనం. కేసీఆర్ తెలంగాణ ప్రజల గుండెల్లో నిలిచిన నాయకుడు.



నోటీసులతో, బెదిరింపులతో తెలంగాణ చరిత్రను చెరిపేయలేరు. తెలంగాణ ఉద్యమాన్ని, తెలంగాణ ఆత్మగౌరవాన్ని అవమానిస్తే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారు. ప్రజల పక్షాన నిలబడి, ప్రజల గొంతుకగా ఈ అన్యాయ పాలనపై పోరాటం కొనసాగిస్తాం" అని కేటీఆర్ తెలిపారు.

* **ఎన్నికల నేపథ్యంలోనే కేసీఆర్‌కు నోటీసులు: కవిత**

ఎన్నికలు జరుగుతున్నాయనే కేసీఆర్‌కు సిట్ నోటీసులు ఇచ్చిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్ బాధాకరమన్న ఆమె.. సిట్ విచారణ సీరియస్‌గా జరగట్లేదని ఆక్షేపించారు. ఈ కేసులో విచారణ ఎక్కడో ఒక దగ్గర పూర్తికావాలని పేర్కొన్నారు. విచారణను పూర్తి చేసే ఉద్దేశం ఉందా లేదా అనేది ఎవరికీ అర్థం కావడంలేదన్నారు. ఫోన్ ట్యాపింగ్ నేరస్థులకు శిక్షపడాల్సిందేనని స్పష్టం చేశారు.

## మున్సిపల్ ఎన్నికల కోసమే కేసీఆర్‌కు నోటీసులు: కవిత

మున్సిపల్ ఎన్నికలు జరుగుతుండడంతోనే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కు సిట్ నోటీసులు జారీ చేసిందని మాజీ ఎమ్మెల్సీ, జాగృతి అధ్యక్షురాలు కవిత అన్నారు. సిట్ పేరుతో గుంపుమేస్త్రీ నాటకాలు ఆడుతున్నారని మండిపడ్డారు. సిట్ విచారణ నాన్ సీరియస్‌గా నడుస్తోందని దుయ్యబట్టారు. జాతీయ జనగణనలో కులగణన సమగ్ర చర్చ పేరుతో నిర్వహించిన



రౌండ్ టేబుల్ సమావేశంలో కవిత పాల్గొన్నారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ సిట్ విచారణను త్వరితగతిన ముగించాలని హితవు పలికారు. ఆ దిశగా ప్రభుత్వం ఆలోచిస్తుందో లేదో ఎవరికీ అర్థం కావడం లేదని అభిప్రాయపడ్డారు. ఫోన్ ట్యాపింగ్ బాధాకరమని అన్నారు. నేరస్థులకు శిక్ష పడుతుందో లేదో వేచి చూడాలని వ్యాఖ్యానించారు.

## నన్ను ఎర్రవల్లిలో విచారణ చేయండి
## : సిట్‌కు కేసీఆర్ ప్రత్యుత్తరం

హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణకు రావాలని సిట్ ఇచ్చిన నోటీసులకు భారత రాష్ట్ర సమితి అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్ స్పందించారు. సిట్ నోటీసులకు కేసీఆర్ ప్రత్యుత్తరం పంపారు. శుక్రవారం విచారణకు రాలేనని పోలీసులకు తెలిపారు. తనను ఎర్రవల్లిలో విచారణ చేయాలని కోరారు. మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి నామినేషన్లకు రేపే చివరి తేదీ అయినందున విచారణకు రాలేనని వివరించారు. మాజీ సీఎం, ప్రతిపక్ష నేతగా విచారణకు



పూర్తిగా సహకరిస్తానని కేసీఆర్ వెల్లడించారు. 160 సీఆర్‌పీసీ కింద విచారణను ఒకే ప్రాంతంలో చేయాలన్న నిబంధనలు లేవని పేర్కొన్నారు. భవిష్యత్తులో నోటీసులన్నింటిని ఎర్రవల్లికే పంపాలని ప్రత్యుత్తరంలో కేసీఆర్ కోరారు.

**స్పందించిన సిట్**

ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణకు రావాలనే తమ ఆదేశాలకు కేసీఆర్ ఇచ్చిన సమాధానంపై సిట్ స్పందించింది. తేదీ, విచారణ ప్రదేశంపై న్యాయ సలహా తీసుకుని మరో నోటీసు ఇవ్వనుంది. రేపు విచారణకు హాజరుకాలేనన్న కేసీఆర్ విజ్ఞప్తిని సిట్ అంగీకరించింది. ఎర్రవల్లిలో విచారణ చేయాలనే కేసీఆర్ విన్నపంపై సిట్ న్యాయ సలహా తీసుకోనుంది. ఆ తర్వాత మరో నోటీసును కేసీఆర్‌కు ఇవ్వనుంది.

## అమ్మాయిలను బ్లాక్ మెయిల్ చేసే వాళ్లకు
## పోలీసులంటే భయం ఉండేలా చర్యలుండాలి: జగ్గారెడ్డి

అమ్మాయిలను బ్లాక్ మెయిల్ చేసే వాళ్లకు పోలీసులంటే భయం ఉండేలా చర్యలుండాలని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు జగ్గారెడ్డి అన్నారు. ఇంటిదగ్గరే ఎఫ్ఐఆర్ నిర్ణయంపై సీఐడీ అధికారి చారు సిన్హా, డీజీపీ శివధర్ రెడ్డి, సీపీ సజ్జనార్‌లను అభినందించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అభినందనీయమన్నారు. గాంధీభవన్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో జగ్గారెడ్డి మాట్లాడుతూ అమ్మాయిల్ని ట్రాప్ చేసే క్రిమినల్స్‌కు సజ్జనార్



చర్యలే సరైనవని తన వ్యక్తిగత అభిప్రాయమని చెప్పారు. బాధిత అమ్మాయిల వివరాలు గోప్యంగా ఉంచాల్సిన బాధ్యత పోలీసులదేనన్నారు. సెక్స్ పరమైన, వ్యక్తిగత వ్యవహారాల్లో ప్రింట్, ఎలక్ట్రానిక్, యూట్యూబ్, సోషల్ మీడియా కొంచెం బాధ్యతతో నడుచుకోవాలని సూచించారు. అలాంటి వార్తలు ప్రచురించకూడదని కోరారు. క్రైమ్ రిపోర్టర్‌ల దగ్గర సమాచారం ఉంటే.. పోలీసులకు సమాచారం ఇవ్వాలని కానీ వివరాలను బహిర్గతం చేయకూడదని విజ్ఞప్తి చేశారు. మీడియాలో కథనాలు సైతం రాయవద్దని సూచించారు. మహిళల భయాలు ఆసరాగా తీసుకుని కొందరు ఆకతాయిలు బ్లాక్ మెయిల్ చేస్తున్నారని అన్నారు. ప్రైవసీ, ఇష్టాయిష్టాలలో ఇంకొకరు వేలు పెట్టొద్దని అభిప్రాయపడ్డారు. సైకో.. బ్లాక్ మెయిల్ చేసే వాళ్ళ విషయంలో చట్టాలు, న్యాయస్థానాలున్నాయని చెప్పారు. తాను రాజకీయ నాయకుడిగా పోలీసులతో కొట్లాడతానన్న ఆయన ఇది పొలిటికల్ గేమ్ అని అన్నారు. పోలీస్.. పాలిటిక్స్ ఎప్పుడూ ఉండేవేనని పేర్కొన్నారు. వైఎస్సార్ హయాంలో ఓ అమ్మాయిని సతాయించిన వాళ్ళను ఎన్కౌంటర్ చేశారని, బీఆర్ఎస్ ప్రభుత్వంలోనూ ఒక ఎన్‌కౌంటర్ చేశారని గుర్తు చేశారు. వ్యక్తిగత అభిప్రాయాలు వేరని, రాజ్యాంగ పరంగా ఎన్‌కౌంటర్‌ను సమర్థించలేమని వివరించారు. కానీ వ్యక్తిగతంగా సమర్థిస్తుంటారని చెప్పారు. మోసపోయిన అమ్మాయికి భరోసా ఇచ్చేలా పోలీసు చర్య ఉండాలన్నారు. మోసం చేయాలన్న ఆలోచన వస్తేనే భయం కలిగేలా చేయాలని సూచించారు.

## హైకోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేసిన
## ఐబొమ్మ రవి




హైదరాబాద్: సినిమా పైరసీ వ్యవహారంలో ఐబొమ్మ రవి హైకోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేశాడు. ఇప్పటికే నాంపల్లి కోర్టులో పలుమార్లు బెయిల్ పిటిషన్లు దాఖలు చేయగా న్యాయస్థానం వాటిని కొట్టివేసింది. దీంతో ఐబొమ్మ రవి హైకోర్టును ఆశ్రయించాడు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం.. కౌంటర్ దాఖలు చేయాలని పోలీసులను ఆదేశించింది. దీంతో సైబర్ క్రైమ్ పోలీసులు మంగళవారం కౌంటరు దాఖలు చేయనున్నారు. ఐబొమ్మ రవిపై సైబర్ క్రైమ్ పోలీసులు నాలుగు కేసులు నమోదు చేశారు. ప్రస్తుతం అతడు చంచల్‌గూడ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నాడు.

## పాతబస్తీలో మరో మూడు ఫ్లైఓవర్లు.. జీహెచ్‌ఎంసీ టెండర్ నోటిఫికేషన్ జారీ

పాతబస్తీలో మరో మూడు ఫ్లైఓవర్ల నిర్మాణానికి జీహెచ్‌ఎంసీ చర్యలు తీసుకోనుంది. ఇప్పటికే నల్గొండ ఎక్స్ రోడ్డు నుంచి ఓవైసీ జంక్షన్ వరకు ఫ్లైఓవర్ పనులు కొనసాగుతున్న విషయం తెలిసిందే. అయితే నిత్యం రద్దీగా ఉండే హాఫిజ్ బాబా నగర్ జంక్షన్ నుంచి బాలాపూర్ చర్చి రోడ్ వరకు (మెట్రో ఫంక్షన్ హాల్ మీదుగా ఒమర్ హోటల్ నుంచి షోయబ్ హోటల్ వరకు) ఆరు లైన్ల బై డైరెక్షనల్ గ్రేడ్ సెపరేటర్ తో కూడిన ఫ్లై ఓవర్ నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసింది. దీంతో పాటు ప్రస్తుతం ఉన్న ఓవైసీ ఫ్లైఓవర్ కోసం లెఫ్ట్ ఆర్మ్ డౌన్ ర్యాంపు ను కూడా నిర్మించాలని జీహెచ్‌ఎంసీ నిర్ణయించింది. దీంతో పాటు బండ్లగూడ నుంచి ఎర్రకుంట క్రాస్ రోడ్డు వరకు ఆరు లైన్ల మరో బై డైరెక్షనల్ ఫ్లై ఓవర్ ను కూడా నిర్మించేందుకు ప్రతిపాదనలను సిద్ధం చేసింది.

**టెండర్ నోటిఫికేషన్ జారీ..**

రూ. 385 కోట్లతో నిర్మించనున్న మూడు ఫ్లైఓవర్ల నిర్మాణానికి జీహెచ్‌ఎంసీ టెండర్ నోటిఫికేషన్ జారీ చేసింది. హెచ్‌సిటీలో భాగంగా గ్రేటర్ లో రూ. 7038 కోట్లకు పనులను చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగానే జీహెచ్‌ఎంసీ టెండర్లు పిలిచింది. ఫిబ్రవరి 3వ తేదీ నుంచి టెండర్లను స్వీకరించేందుకు జీహెచ్‌ఎంసీ ఏర్పాట్లు చేసింది. వచ్చే నెల 12న ప్రీ బిడ్ సమావేశాన్ని నిర్వహించి, 20వ తేదీ వరకు టెండర్లను స్వీకరించనున్నట్లు జీహెచ్‌ఎంసీ అధికారులు వెల్లడించారు. టెక్నికల్, ఫైనాన్స్ బిడ్ల ప్రక్రియను పూర్తి చేసిన అనంతరం మార్చి 1వ తేదీ నుంచి పనులను ప్రారంభించాలని అధికారులు భావిస్తున్నట్లు తెలిసింది. ఓవైసీ ఫ్లైఓవర్ కు ర్యాంప్, హాఫిజ్ బాబా నగర్ జంక్షన్ నుంచి బాలాపూర్ చర్చి రోడ్ వరకు, బండ్లగూడ నుంచి ఎర్రకుంట క్రాస్ రోడ్డు వరకు రెండు ఆరు లైన్ల ఫ్లై ఓవర్ల నిర్మాణం పూర్తయి అందుబాటులోకి వస్తే పాతబస్తీ, శంషాబాద్ ఎయిర్ పోర్ట్ నుంచి బాలాపూర్ తదితర ప్రాంతాలకు రాకపోకలు ఎలాంటి అడ్డంకులు లేకుండా మరింత వేగంగా సాగే అవకాశాలున్నాయని అధికారులు చెబుతున్నారు.

# ఆర్థిక సర్వేతో ఇన్వెస్టర్లలో జోష్..

సెన్సెక్స్, నిఫ్టీ లాభాల పరుగు

వరుసగా మూడో రోజు లాభాలతో ముగిసిన స్టాక్ మార్కెట్లు

ఆర్థిక సర్వే సానుకూల అంచనాలతో పెరిగిన ఇన్వెస్టర్ల సెంటిమెంట్

221 పాయింట్ల లాభంతో 82,566 వద్ద స్థిరపడిన సెన్సెక్స్

మెటల్,ఇన్‌ఫ్రా రంగాల షేర్లలో కొనుగోళ్ల సందడి

యూనియన్ బడ్జెట్ నేపథ్యంలో బలహీనపడిన రూపాయి



**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా మూడో రోజు లాభాలతో ముగిశాయి. ప్రభుత్వం విడుదల చేసిన వార్షిక ఆర్థిక సర్వే ఇన్వెస్టర్లలో కొత్త ఉత్సాహాన్ని నింపింది. దేశ ఆర్థిక వృద్ధి, ద్రవ్యలోటుపై సర్వేలో సానుకూల అంచనాలు వెలువడటంతో, ఆరంభంలో ఒడుదొడుకులకు లోనైన సూచీలు చివరికి లాభాల్లో స్థిరపడ్డాయి.

2026-27 ఆర్థిక సంవత్సరంలో భారత జీడీపీ వృద్ధి 6.8 నుంచి 7.2 శాతం మధ్య ఉంటుందని ఆర్థిక సర్వే అంచనా వేసింది. అలాగే, 2026 ఆర్థిక సంవత్సరానికి ద్రవ్యలోటు లక్ష్యమైన 4.4 శాతాన్ని చేరుకునే దిశగా దేశం పయనిస్తోందని పేర్కొనడం ఇన్వెస్టర్ల విశ్వాసాన్ని పెంచింది. గురువారం ట్రేడింగ్ ముగిసే సమయానికి, సెన్సెక్స్ 221.6 పాయింట్లు లాభపడి 82,566.37 వద్ద ముగిసింది. నిఫ్టీ కూడా 76.15 పాయింట్లు పెరిగి 25,418.90 వద్ద స్థిరపడింది.

ఈ సెషన్‌లో మెటల్, సంబంధిత స్టాక్స్ మంచి పనితీరు కనబరిచాయి. సెన్సెక్స్‌లో టాటా స్టీల్, ఎల్‌డటీ, యాక్సిస్ బ్యాంక్, ఎటర్నల్, ఎన్‌టీపీసీ షేర్లు 4.5 శాతం వరకు లాభపడ్డాయి. మరోవైపు, ఏషియన్ పెయింట్స్, ఇండిగో, మారుతీ సుజుకీ, టీసీఎస్, బీఈఎల్ వంటి షేర్లు నష్టపోయాయి. రంగాల వారీగా చూస్తే నిఫ్టీ మెటల్ ఇండెక్స్ 3 శాతానికి పైగా దూసుకెళ్లగా, నిఫ్టీ హెల్త్‌కేర్, ఫార్మా, ఎఫ్ఎంసీజీ సూచీలు నష్టాల్లో ముగిశాయి.

సాంకేతికంగా నిఫ్టీకి 25,300 వద్ద తక్షణ మద్దతు ఉందని, ఒకవేళ ఈ స్థాయిని దాటితే 25,600-25,800 స్థాయిలకు చేరే అవకాశం ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. మరోవైపు, యూనియన్ బడ్జెట్ సమీపిస్తుండటంతో రూపాయి విలువ డాలర్‌తో పోలిస్తే 0.12 తగ్గి 91.94 వద్ద బలహీనంగా ట్రేడ్ అయింది.

## మరింత వేగంగా వెండి పరుగులు..

రూ.4 లక్షలు దాటిన కిలో ధర




**న్యూఢిల్లీ:** దేశీయంగా బంగారం, వెండి ధరలు మరింత వేగంగా పరుగులు పెడుతున్నాయి. బంగారం ధర దాదాపు రూ.2 లక్షలకు చేరువ కాగా.. వెండి ధర ఫ్యూచర్స్ మార్కెట్‌లో ఏకంగా రూ.4 లక్షలు దాటి ఆల్‌టైమ్ గరిష్ఠానికి చేరుకుంది. హైదరాబాద్‌లో గురువారం ఉదయం 10 గంటల సమయంలో 24 క్యారెట్స్ 10 గ్రాముల బంగారం ధర రూ.1,85,000 దాటింది. వెండి ధర రూ.4 లక్షల మార్కును దాటేసింది.

బుధవారం రాత్రి హైదరాబాద్ విపణిలో 10 గ్రాముల 24 క్యారెట్స్ బంగారం ధర రూ.1,73,300 గా ఉంది. కొన్ని గంటల్లోనే రూ.12 వేలు పెరిగింది. బుధవారం కిలో వెండి ధర రూ.3,79,700 వద్ద ముగియగా.. ఇవాళ ఏకంగా రూ.21 వేలకుపైగా పెరిగి రూ.4 లక్షల మార్కును దాటింది. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్‌లో మార్చి డెలివరీ కాంట్రాక్టుకు ఫ్యూచర్స్‌లో వెండి ధర గురువారం ఒక్కరోజే రూ.22,090 కి పెరిగి రూ.4,07,456 వద్ద సరికొత్త జీవనకాల గరిష్ఠాన్ని తాకింది.

అంతర్జాతీయ మార్కెట్‌లోనూ బంగారం, వెండి ధరలు రికార్డు స్థాయిలో పెరుగుతున్నాయి. ఔన్స్ వెండి ధర తొలిసారి 5,600 డాలర్ల మార్క్ దాటింది. కమోడిటీ ఎక్స్ఛేంజ్‌లో ఏప్రిల్ డెలివరీకి ఔన్సు ధర రూ.5,626.8 డాలర్లు పలికింది. ఔన్సు వెండి ధర రూ.119.51 డాలర్లకు చేరింది. అమెరికా డాలర్ విలువ బలహీనపడటం, వెండికి పరిశ్రమల నుంచి డిమాండ్ పెరగడంతో వైట్ గోల్డ్‌కు రెక్కలొచ్చాయని బులియన్ విశ్లేషకులు చెబుతున్నారు. కాగా అంతర్జాతీయంగా భౌగోళిక, రాజకీయ అనిశ్చితుల నేపథ్యంలో బంగారం, వెండిని సురక్షిత పెట్టుబడి సాధనంగా మదుపర్లు భావిస్తున్నారు. ఇది కూడా ధరల పెరుగుదలకు కారణం అవుతోంది.

## మౌలిక సదుపాయాల్లో దూసుకెళుతున్న భారత్..

ఆర్థిక సర్వే 2026లో కీలక విషయాలు

మౌలిక రంగంలో భారత్ దూకుడును వెల్లడించిన ఆర్థిక సర్వే 2025-26

పదేళ్లలో మూడు రెట్లు పెరిగిన పునరుత్పాదక ఇంధన సామర్థ్యం

2014 నుంచి రెట్టింపునకు పైగా పెరిగిన విమానాశ్రయాల సంఖ్య

జాతీయ రహదారుల నెట్‌వర్క్‌లో 60 శాతం వృద్ధి

ప్రభుత్వ మూలధన వ్యయం 4.2 రెట్లు పెరిగిందని వెల్లడి



**న్యూఢిల్లీ:** భారతదేశ వృద్ధి వ్యూహంలో మౌలిక సదుపాయాల రంగం కేంద్ర స్థానంలో ఉందని, ఈ రంగంలో ప్రభుత్వ మూలధన వ్యయం స్థిరంగా పెరుగుతోందని ఆర్థిక సర్వే 2025-26 స్పష్టం చేసింది. ఇవాళ విడుదల చేసిన ఈ సర్వే ప్రకారం, ప్రైవేట్ పెట్టుబడులను ఆకర్షించడంలో భారత్ ప్రపంచంలోనే అగ్రగామి దేశాల్లో ఒకటిగా నిలిచింది. తక్కువ, మధ్య ఆదాయ ఆర్థిక వ్యవస్థలలో మౌలిక సదుపాయాల కల్పనలో ప్రైవేట్ పెట్టుబడుల విషయంలో ప్రపంచ బ్యాంకు ర్యాంకింగ్స్‌లో భారత్ టాప్-5 దేశాల్లో ఒకటిగా నిలిచింది.

పీఎం గతిశక్తి, జాతీయ లాజిస్టిక్స్ పాలసీ వంటివి ఈ వృద్ధికి దోహదపడ్డాయని సర్వే పేర్కొంది. దీనివల్ల లావాదేవీల ఖర్చులు, ప్రాజెక్టుల అమలులో రిస్కులు తగ్గాయి. ప్రభుత్వ మూలధన వ్యయం ఎఫ్‌వై18లో రూ. 2.63 లక్షల కోట్ల నుంచి ఎఫ్‌వై26 నాటికి రూ. 11.21 లక్షల కోట్లకు, అంటే దాదాపు 4.2 రెట్లు పెరిగింది.

జాతీయ రహదారుల నెట్‌వర్క్ 2014లో 91,287 కిలోమీటర్ల నుంచి 2026 డిసెంబర్ నాటికి 1,46,572 కిలోమీటర్లకు విస్తరించింది. విమానయాన రంగంలో విమానాశ్రయాల సంఖ్య 2014లో 74 నుంచి 2025 నాటికి 164కు పెరిగింది. రైల్వే నెట్‌వర్క్‌లో 99.1 శాతం విద్యుదీకరణ పూర్తయింది. 'మారిటైమ్ ఇండియా విజన్' వంటి పథకాలతో భారత పోర్టుల పనితీరు మెరుగుపడి, 7 పోర్టులు ప్రపంచ బ్యాంకు టాప్ 100 జాబితాలో స్థానం దక్కించుకున్నాయి.

విద్యుత్ రంగంలోనూ భారీ విస్తరణ జరిగింది. మొత్తం స్థాపిత సామర్థ్యం 509.74 గిగావాట్లకు చేరగా, ఇందులో పునరుత్పాదక ఇంధన వాటా దాదాపు 49.83 శాతంగా ఉంది. గత దశాబ్ద కాలంలో పునరుత్పాదక ఇంధన సామర్థ్యం మూడు రెట్లకు పైగా పెరిగి 253.96 గిగావాట్లకు చేరుకుందని సర్వే తెలిపింది. పునరుత్పాదక ఇంధన ఉత్పత్తిలో భారత్ ప్రపంచంలో మూడో స్థానంలో ఉంది.

# కొనసాగుతున్న ఉత్కంఠ




వరల్డ్ కప్‌కు 3 రోజుల ముందు వాషింగ్టన్ సుందర్‌కు ఫిట్‌నెస్ పరీక్ష..

టీ20 ప్రపంచకప్‌లో వాషింగ్టన్ సుందర్ ఆడటంపై సందేహాలు

గాయం నుంచి కోలుకోకపోవడంతో ఫిబ్రవరి 4న ఫిట్‌నెస్ టెస్ట్

టెస్ట్ రిపోర్ట్ వచ్చేవరకూ ప్రత్యామ్నాయం ప్రకటించని సెలక్టర్లు

సుందర్ స్థానంలో రియాన్ పరాగ్‌ను పరిశీలిస్తున్నట్లు సమాచారం

**న్యూఢిల్లీ:** టీ20 ప్రపంచకప్ 2026 ముంగిట టీమిండియాలో ఆందోళన నెలకొంది. స్టార్ స్పిన్ బౌలింగ్ ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ టోర్నీలో ఆడటంపై అనుమానాలు నెలకొన్నాయి. గాయం నుంచి ఇంకా పూర్తిగా కోలుకోకపోవడంతో అతని ఫిట్‌నెస్‌ను నిర్ధారించేందుకు ఫిబ్రవరి 4న బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో కీలక ఫిట్‌నెస్ పరీక్ష నిర్వహించనున్నారు.

ఈ నెల 11న న్యూజిలాండ్‌తో జరిగిన తొలి వన్డేలో సుందర్ పక్కటెముకల గాయానికి గురయ్యాడు. అతను కోలుకోవడానికి అనుకున్నదానికంటే ఎక్కువ సమయం పడుతోంది. సుందర్ నుంచి అధికారిక మెడికల్ అప్‌డేట్ వచ్చేవరకు ఎలాంటి ప్రత్యామ్నాయం ప్రకటించకూడదని సెలక్టర్లు, టీమ్ మేనేజ్‌మెంట్ నిర్ణయించుకున్నట్లు తెలిసింది. నిబంధనల ప్రకారం ఈ నెల 30లోపు జట్లలో మార్పులు చేసుకోవచ్చు. అయితే, టోర్నమెంట్ టెక్నికల్ కమిటీ అనుమతిస్తే గాయం కారణంగా టోర్నీ మధ్యలో కూడా ఆటగాళ్లను మార్చుకునే అవకాశం ఉంటుంది.

భారత జట్టు ఫిబ్రవరి 3న ముంబైలో సమావేశమై, ఫిబ్రవరి 4న దక్షిణాఫ్రికాతో వార్మప్ మ్యాచ్ ఆడనుంది. అదే రోజు సుందర్‌కు ఫిట్‌నెస్ టెస్ట్ జరగనుండటం ప్రాధాన్యం సంతరించుకుంది. బీసీసీఐ వర్గాల సమాచారం ప్రకారం సుందర్‌కు పక్కటెముకల దగ్గర కండరాల్లో చీలిక ఏర్పడినట్లు తెలుస్తోంది. గాయం నుంచి సహజంగా కోలుకున్న తర్వాతే అతను తిరిగి మైదానంలోకి రావాల్సి ఉంటుందని ఓ అధికారి తెలిపారు.

ఒకవేళ సుందర్ అందుబాటులో లేకపోతే అతని స్థానంలో రియాన్ పరాగ్‌ను ప్రధాన ప్రత్యామ్నాయంగా చూస్తున్నట్లు సమాచారం. వైస్ కెప్టెన్ అక్షర్ పటేల్ జట్టులో ఉండటంతో టీమ్ బ్యాలెన్స్ పటిష్ఠంగానే కనిపిస్తోంది.

## వ్యూహం వికటించింది..

నాలుగో టీ20లో ఓటమిపై సూర్యకుమార్

వరల్డ్ కప్ వ్యూహంలో భాగంగానే 'ఐదుగురు బౌలర్ల' ప్రయోగమన్న సూర్యకుమార్

ఆటగాళ్ల సత్తాను పరీక్షించేందుకే బ్యాటర్ల సంఖ్యను తగ్గించినట్లు వెల్లడి

శివమ్ దూబే మెరుపు ఇన్నింగ్స్‌ను మెచ్చుకున్న సూర్య

అతడికి తోడుగా మరో బ్యాటర్ ఉంటే ఫలితం వేరేలా ఉండేదన్న కెప్టెన్



**విశాఖపట్నం:** విశాఖపట్నం వేదికగా న్యూజిలాండ్‌తో జరిగిన నాలుగో టీ20లో టీమ్ ఇండియా 50 పరుగుల తేడాతో ఓటమి పాలైనప్పటికీ కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ మాత్రం ధీమాగా ఉన్నాడు. ఈ ఓటమి తమకు ఒక గొప్ప పాఠమని, రాబోయే ప్రపంచకప్‌కు సిద్ధమవ్వడంలో భాగంగానే తాము ఉద్దేశపూర్వకంగానే ఐదుగురు స్పెషలిస్ట్ బౌలర్లతో బరిలోకి దిగామని ఆయన స్పష్టం చేశాడు.

మ్యాచ్ అనంతరం సూర్య మాట్లాడుతూ.. "మేము ఈ రోజు కావాలనే ఆరుగురు బ్యాటర్లు, ఐదుగురు పక్కా బౌలర్లతో ఆడాము. 200 పరుగుల లక్ష్యాన్ని ఛేదించేటప్పుడు, ఆరంభంలోనే వికెట్లు పడితే మిగిలిన వారు ఎలా ఆడతారో పరీక్షించాలనుకున్నాం. అందుకే ఈ కఠిన నిర్ణయం తీసుకున్నాం. వరల్డ్ కప్ జట్టులో భాగమైన ఆటగాళ్లందరికీ అవకాశం ఇవ్వడం మా ప్రాధాన్యం" అని పేర్కొన్నారు.

మంచు ప్రభావం ఎక్కువగా ఉన్నప్పటికీ, శివమ్ దూబే వీరోచిత పోరాటంపై సూర్య ప్రశంసలు కురిపించాడు. "దూబే అద్భుతంగా ఆడాడు. ఆ సమయంలో అతనికి తోడుగా మరో బ్యాటర్ నిలబడి ఉంటే ఫలితం కచ్చితంగా మారిపోయేది. 50 పరుగుల తేడాతో ఓడిపోయినప్పటికీ, భారీ లక్ష్యాలను ఎలా ఛేదించాలనే విషయంలో మాకు స్పష్టత వచ్చింది. మళ్లీ అవకాశం వస్తే ఛేజింగ్‌కే మొగ్గు చూపుతాం" అని తన వ్యూహాన్ని వివరించాడు.

వరుసగా మూడు విజయాల తర్వాత భారత్‌కు ఇది తొలి ఓటమి. ఫిబ్రవరిలో జరగనున్న టీ20 వరల్డ్ కప్ కోసం భారత జట్టు కూర్పుపై యాజమాన్యం చేస్తున్న ప్రయోగాల్లో భాగంగానే ఈ మార్పులు జరిగినట్లు తెలుస్తోంది.

## డబ్ల్యూపీఎల్‌తో యువపేసర్ దశ తిరిగింది..

ఆస్ట్రేలియా కెప్టెన్‌గా మొలినెక్స్..!



**సిడ్నీ:** మహిళల ప్రీమియర్ లీగ్‌తో యువ క్రికెటర్ల సుడి తిరుగుతోంది. ఈ మెగా టోర్నీలో సంచలన ప్రదర్శనతో వరుసగా జాతీయ జట్టుకు ఎంపికవుతున్నారు. గుజరాత్ జెయింట్స్ హిట్టర్ భారతి ఫుల్‌మాలి టీమిండియా జెర్సీ వేసుకోనుంది. ఇప్పుడు 19 ఏళ్ల లూసీ హామిల్టన్ ఆస్ట్రేలియా జట్టుకు ఎంపికైంది. త్వరలోనే స్వదేశంలో భారత జట్టుతో జరుగనున్న ఏకైక టెస్టుకు ఈ లెఫ్ట్ ఆర్మ్ పేసర్‌ను స్క్వాడ్‌లోకి తీసుకున్నారు సెలెక్టర్లు. డబ్ల్యూపీఎల్‌లో ఢిల్లీ క్యాపిటల్స్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న హామిల్టన్ ఈ మ్యాచ్‌తో సుదీర్ఘ ఫార్మాట్‌లో అరంగేట్రం చేయనుంది.

ఫిబ్రవరిలో భారత జట్టుతో మూడు ఫార్మాట్ల సిరీస్ కోసం క్రికెట్ ఆస్ట్రేలియా స్క్వాడ్‌ను ప్రకటించింది. స్వదేశంలో ఈ సిరీస్‌తో వీడ్కోలు పలుకనున్న అలీసా హీలీ(ంశ్రీఎబబజీ ఉవజీశ్రీం) వన్డే, టెస్టులకు సారథిగా.. సోఫీ మొలినెక్స్(రానీజూష్ట్రతివ ఓనీశ్రీతినివబీలీ) టీ20లకు కెప్టెన్‌గా వ్యవహరించనున్నారు. అండర్ -19 వరల్డ్‌కప్‌లో, మహిళల బిగ్‌బాష్ లీగ్‌లోఅదరగొట్టిన లూసీ హామిల్టన్.. మహిళల ప్రీమియర్ లీగ్‌లో రాణించడంతో టెస్టులకు తీసుకున్నారు. ముంబై ఇండియన్స్ తరఫున ఆల్‌రౌండ్ షోతో ఆకట్టుకుంటున్న నికోలా కారీ కూడా వన్డే, టీ20ల స్క్వాడ్‌లో చోటు దక్కించుకుంది.

ఆస్ట్రేలియా టీ20 స్క్వాడ్ : డార్సీ బ్రౌన్, నికోలా కారీ, అష్లే గార్డ్‌నర్, కిమ్ గార్త్, గ్రేస్ హ్యారిస్, ఫొబే లిచ్‌ఫీల్డ్, తహ్లియా మెక్‌గ్రాత్, సోఫీ మొలినెక్స్(కెప్టెన్), బేత్ మూనీ, ఎలీసా పెర్రీ, మేగన్ షట్, అనాబెల్ సథర్‌లాండ్, జార్జియా వోల్, జార్జియా వరేహం.

ఆస్ట్రేలియా వన్డే స్క్వాడ్ : డార్సీ బ్రౌన్, నికోలా కారీ, అష్లే గార్డ్‌నర్, కిమ్ గార్త్, అలీసా హీలీ(కెప్టెన్), అలనా కింగ్, ఫొబే లిచ్‌ఫీల్డ్, తహ్లియా మెక్‌గ్రాత్, సోఫీ మొలినెక్స్, బేత్ మూనీ, ఎలీసా పెర్రీ, అనాబెల్ సథర్‌లాండ్, జార్జియా వోల్, జార్జియా వరేహం.

ఆస్ట్రేలియా టెస్టు స్క్వాడ్ : డార్సీ బ్రౌన్, అష్లీ గార్డ్‌నర్, కిమ్ గార్త్, లూసీ హామిల్టన్, అలీసా హీలీ(కెప్టెన్), అలనా కింగ్, ఫొబే లిచ్‌ఫీల్డ్, తహ్లియా మెక్‌గ్రాత్, సోఫీ మొలినెక్స్, ఎలీసా పెర్రీ, అనాబెల్ సథర్‌లాండ్, జార్జియా వోల్, జార్జియా వరేహం.

## మళ్లీ అదే తప్పు చేసిన సంజూ..

అతడు ఔటైన తీరుపై గవాస్కర్ అసహనం!

న్యూజిలాండ్‌తో టీ20లో మరోసారి విఫలమైన సంజూ శాంసన్

అసలు ఫుట్‌వర్క్ లేకుండా ఆడాడని సునీల్ గవాస్కర్ విమర్శ

సంజూ పేలవ ఫామ్‌తో టీ20 ప్రపంచకప్ స్థానంపై నీలినీడలు

గత నాలుగు మ్యాచుల్లో చేసింది కేవలం 40 పరుగులే




**న్యూఢిల్లీ:** టీమిండియా వికెట్ కీపర్ బ్యాటర్ సంజూ శాంసన్ మరోసారి నిరాశపరిచాడు. న్యూజిలాండ్‌తో నిన్న జరిగిన నాలుగో టీ20లో మంచి ఆరంభం లభించినా, దాన్ని భారీ స్కోరుగా మలచడంలో విఫలమయ్యాడు. ఈ మ్యాచ్‌లో 15 బంతుల్లో 24 పరుగులు చేసిన శాంసన్, మిచెల్ శాంట్నర్ బౌలింగ్‌లో ఔటయ్యాడు. అయితే, అతడు ఔటైన తీరుపై భారత దిగ్గజ ఆటగాడు సునీల్ గవాస్కర్ తీవ్ర అసహనం వ్యక్తం చేశాడు.

కామెంటరీలో గవాస్కర్ మాట్లాడుతూ.. "నాకు మొదట అనిపించింది ఏంటంటే, అతడికి ఫుట్‌వర్క్ ఏమాత్రం లేదు. బంతి ఏమైనా టర్న్ అయిందో లేదో కచ్చితంగా తెలియదు. కానీ, అతను అక్కడే నిలబడి, ఆఫ్‌సైడ్ ఆడేందుకు ప్రయత్నించాడు" అని విశ్లేషించాడు.

సంజూ పదేపదే ఇదే తరహాలో ఔటవుతున్నాడని సన్నీ అసహనం వ్యక్తం చేశాడు. "చెప్పినట్టుగానే, కాళ్ల కదలిక దాదాపుగా లేదు. లెగ్-స్టంప్ బయటకు వెళ్లి, మూడు స్టంప్‌లు బౌలర్‌కు కనిపించేలా చేశాడు. అలాంటప్పుడు బంతి మిస్ అయితే బౌలర్ స్టంప్‌లను కొడతాడు. సంజూ శాంసన్‌కు ఇది రెండోసారి ఇలా జరగడం" అని గవాస్కర్ ఘాటుగా వ్యాఖ్యానించాడు.


ఇక, గత నాలుగు మ్యాచుల్లో సంజూ కేవలం 40 పరుగులే చేయడం గమనార్హం. మరోవైపు ఇషాన్ కిషన్ మూడో స్థానంలో రాణిస్తుండటంతో రానున్న టీ20 ప్రపంచకప్ జట్టులో అతడి స్థానంపై సందేహాలు మొదలయ్యాయి. ఈ వైఫల్యాలతో ప్రపంచకప్ జట్టులో స్థానం సంపాదించడం శాంసన్‌కు కష్టంగా మారే అవకాశం ఉంది.

# కోలీవుడ్ ఎంట్రీకి సిద్ధమవుతున్న మృణాల్

**టాకీస్:** వారానికో కొత్త హీరోయిన్ పరిచయమవుతున్న ఈ రోజుల్లో సినీ ఇండస్ట్రీలో నిలదొక్కుకోవడం కథానాయికలకు పెద్ద సవాలుగానే మారింది. అందుకే క్రేజ్ ఉన్నప్పుడే అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలనే ఆలోచనతో ముందుకెళ్తున్నారు. ముఖ్యంగా పాన్ ఇండియా ట్రెండ్ బలపడిన తర్వాత ఒక్క భాషకే పరిమితం కాకుండా ఇతర ఇండస్ట్రీల్లోనూ తమ సత్తా చాటాలని హీరోయిన్లు ఆసక్తి చూపిస్తున్నారు. ఒకవైపు నార్త్ భామలు సౌత్ సినిమాలపై దృష్టి పెడుతుంటే, మరోవైపు దక్షిణాది కథానాయికలు బాలీవుడ్‌లో తమ అదృష్టాన్ని పరీక్షించుకోవాలని భావిస్తున్నారు.ఇప్పటికే పలువురు సౌత్ హీరోయిన్లు హిందీ చిత్ర పరిశ్రమలో అడుగుపెట్టగా, కొందరు అక్కడ మంచి గుర్తింపు సంపాదించుకున్నారు.

మరికొందరు మాత్రం ఆశించిన స్థాయిలో అవకాశాలు అందుకోలేక ఫేడ్ అవుట్ అయ్యారు. ఈ నేపథ్యంలో ఇప్పుడు మరో దక్షిణాది హీరోయిన్ ప్రీతి ముకుందన్ బాలీవుడ్ ఎంట్రీకి రెడీ అవుతున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. టాలీవుడ్‌లో 'ఓం భీమ్ బుష్' సినిమాతో హీరోయిన్‌గా పరిచయమైన ప్రీతి ముకుందన్, ఆ తర్వాత స్టార్ మూవీతో తమిళ ఇండస్ట్రీలో అడుగుపెట్టింది. 'కన్నప్ప' సినిమాలో నెమలి పాత్రలో ఆమె చేసిన నటనకు మంచి గుర్తింపు లభించింది. ఇక మలయాళంలో 'సర్వం మాయ' సినిమాతో బ్లాక్‌బస్టర్ హిట్‌ను ఖాతాలో వేసుకుని, అన్ని భాషల్లోనూ తనకంటూ ఓ గుర్తింపు తెచ్చుకుంది. ఇప్పుడు ప్రీతి ముకుందన్‌కు బాలీవుడ్ నుంచి బంపర్ ఆఫర్ వచ్చిందన్న టాక్ ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. బాలీవుడ్ యంగ్ హీరో కార్తీక్ ఆర్యన్ సరసన ఆమె నటించే అవకాశం ఉందని సినీ వర్గాలు చెబుతున్నాయి.

కార్తీక్ ప్రస్తుతం 'నాగ్జిల్లా' సినిమాతో పాటు దర్శకుడు కబీర్ ఖాన్‌తో ఓ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్ చేస్తున్నాడు. ఈ రెండు సినిమాల్లో ఏదో ఒకదానిలో ప్రీతి హీరోయిన్‌గా ఎంపికయ్యే అవకాశముందని సమాచారం. ప్రస్తుతం ఆమెతో చర్చలు జరుగుతున్నాయని, అన్నీ అనుకూలిస్తే త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉందని అంటున్నారు. ఇక మరోవైపు గార్జియస్ బ్యూటీ మృణాల్ ఠాకూర్ కోలీవుడ్ ఎంట్రీపై వార్తలు నెట్టింట చక్కర్లు కొడుతున్నాయి. మృణాల్ ప్రస్తుతం ఆమె 'డెకాయిట్'తో పాటు అల్లు అర్జున్ ? అట్లీ కాంబినేషన్‌లో రూపొందుతున్న భారీ చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తోంది.





# వరుసగా సినిమాలతో ప్రభాస్ బిజీ

**టాకీస్:** వరుసగా సినిమాలు పూర్తి చేయడంలో ప్రభాస్ బిజీగా ఉన్నారు. ప్రస్తుతం 'ఫౌజీ', 'స్పిరిట్' సినిమాల చిత్రీకరణ సాగుతుండగా, 'కల్కి2' సినిమానీ పట్టాలెక్కించాలని నిర్ణయించారు. విజయవంతమైన 'కల్కి 2898 ఏడీ'కి కొనసాగింపుగా రూపొందుతున్న చిత్రమే 'కల్కి 2'. నాగ్ అశ్విన్ కొంతకాలంగా ఈ సినిమా పూర్వ నిర్మాణ పనుల్ని చేస్తూ వస్తున్నారు. వచ్చే నెలలోనే ప్రారంభం కానున్న ఈ సినిమాకీ ప్రభాస్ కొన్ని రోజులు డేట్స్ కేటాయించినట్టు తెలుస్తోంది. అంటే... మళ్లీ మూడు సినిమాల్ని ఒకేసారి ముందుకు నడిపిస్తారన్నమాట. 'ది రాజాసాబ్' ఫలితాన్ని దృష్టిలో పెట్టుకుని వీలైనంత త్వరగా ఆయన కొత్త సినిమాని ప్రేక్షకుల ముందుకు తీసుకు రావా లనే ఉద్దేశంలో ఉన్నట్టు తెలుస్తోంది. నిజానికి ఒక సినిమా పూర్తయ్యాక మరొక సినిమా అనే పద్ధతికి ఎప్పుడో ఫుల్‌స్టాప్ పెట్టేశారు ప్రభాస్. ఆయన కొంతకాలంగా ఒకేసారి రెండు, మూడు చొప్పున సినిమాల్ని ముందుకు నడిపిస్తున్నారు. 'ది రాజా సాబ్' సినిమాతో బిజీగా ఉన్న సమయంలోనే, 'కల్కి 2898 ఎ.డి', 'ఫౌజీ' సినిమాల్నీ చేశారు. దేశవ్యాప్తంగా బలమైన మార్కెట్ ఉన్న ఆయన కోసం పలు కథలు సిద్ధం అవుతున్నా యి. అన్నీ కూడా పాన్ ఇండియా స్థాయిలో, హంగులతో రూపొందుతున్న కథలే. ఏడాదికి రెండు సినిమాల్నైనా ప్రేక్షకు ల ముందుకు తీసుకు రావాలనే లక్ష్యంతో ఆయన ఆయా ప్రాజె క్టుల్ని వెంట వెంటనే పట్టాలెక్కిస్తూ వాటి కోసం డేట్లు కేటాయిస్తున్నారు.

## హైప్ క్రియేట్ చేసినా..
# ప్రేక్షకులు ఆదరిస్తారా అన్నదే ముఖ్యం

### సినిమాల తీరుపై నటుడు విజయ్ సేతుపతి కామెంట్స్

**టాకీస్:** తెలుగు, తమిళంతోపాటు పాన్ ఇండియా ఇమేజ్ ఉన్న యాక్టర్లలో టాప్‌లో ఉంటాడు కోలీవుడ్ యాక్టర్ విజయ్ సేతుపతి. ప్రస్తుతం అరవింద్ స్వామితో కలిసి గాంధీ టాక్స్ సినిమాలో నటిస్తున్నాడు. సాదాసీదా నటనతో ప్రేక్షకులను కట్టిపడేయడం ఈ టాలెంటెడ్ నటుడి స్పెషాలిటీ అని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆసక్తికర విషయాలు షేర్ చేసుకున్నాడు మక్కళ్ సెల్వన్. ఈ రోజుల్లో చాలా మంది యాక్టర్లు, డైరెక్టర్లు తమ సినిమాలు ప్రేక్షకులను ఆకర్షించేందుకు హైప్ క్రియేట్ చేసేందుకు ఏదో ఒక విషయాన్ని హైలెట్ చేయాలని




ప్రయత్నిస్తుంటారని తెలిసిందే. విజయ్ సేతుపతి తన అప్‌కమింగ్ మూకీ సినిమా 'గాంధీ టాక్స్' గురించి మాట్లాడాడు.. డైలాగ్స్ లేకుండా ఎమోషన్స్‌తో ప్రేక్షకులతో దగ్గరయ్యేందుకు రెడీ అవుతున్నారు విజయ్ సేతుపతి, అరవింద్ స్వామి. ప్రేక్షకులకు వినోదం కోసం థియేటర్లకు వస్తారు కాబట్టి ఫిల్మ్‌మేకర్స్ ప్రేక్షకులు అర్థం చేసుకోలేని విధంగా సినిమా తీయొద్దని సూచించాడు విజయ్ సేతుపతి. ఓ వైపు ప్రయోగాలకు వెల్ కమ్ చెబుతూనే.. మరోవైపు ప్రేక్షకులు ప్రత్యేకించి డబ్బులు చెల్లించి సినిమా చూసేందుకు వస్తున్నప్పుడు వారికి ఖర్చు భారమనిపించేలా సినిమా ఉండకూడదని అన్నాడు విజయ్ సేతుపతి.

# ఒప్పుకోకుంటే లేచి పోదామనుకున్నం

### పెళ్లి వార్తలపై షాకింగ్ విషయాలు చెప్పిన కీర్తి సురేశ్

టాకీస్: 'మహానటి' కీర్తి సురేష్ తన చిన్ననాటి స్నేహితుడు, లాంగ్ టైమ్ బాయ్‌ఫ్రెండ్ ఆంటోనీ తట్టిల్‌ను ప్రేమ వివాహం చేసుకుని అభిమానులను సర్ప్రైజ్ చేసిన విషయం తెలిసిందే. అయితే తాజాగా తన ప్రేమ, పెళ్లికి సంబంధించిన కొన్ని షాకింగ్ విషయాలను కీర్తి సురేష్ తాజాగా పంచుకుంది. తాము 15 ఏళ్లుగా ప్రేమలో ఉన్నామని, ఒకానొక దశలో తమ పెళ్లికి పెద్దలు అంగీకరించకపోతే 'లేచిపోయి' పెళ్లి చేసుకోవాలని కూడా నిర్ణయించుకున్నట్లు ఆమె వెల్లడించి అందరినీ ఆశ్చర్యపరిచింది. తమ పెళ్లి ఇంత వైభవంగా, అందరి సమక్షంలో జరుగుతుందని తాము అస్సలు ఊహించలేదని, కానీ చివరికి పెద్దల అంగీకారంతో గోవాలో కుటుంబ సభ్యుల మధ్య తమ వివాహం వేడుకగా జరిగిందని కీర్తి పేర్కొంది.

పెళ్లి సమయంలో జరిగిన భావోద్వేగ క్షణాలను గుర్తు చేసుకుంటూ, ఎప్పుడూ చాలా ధైర్యంగా, దృఢంగా ఉండే ఆంటోనీ తాళి కట్టే సమయంలో తొలిసారి ఎమోషనల్ అయ్యాడని ఆమె తెలిపింది. ఆయన కళ్లలో నీళ్లు చూడటంతో తాను కూడా భావోద్వేగానికి లోనయ్యానని, 15 ఏళ్ల నిరీక్షణ కేవలం 30 సెకన్ల మంగళసూత్ర ధారణతో ఒక అందమైన బంధంగా మారిందని కీర్తి ఆనందం వ్యక్తం చేసింది. ఆ క్షణం ఒక కల నిజమైనట్లు అనిపించిందని, ఆ ఆనందంలో కన్నీళ్లు ఆగలేదని ఆమె చెప్పుకొచ్చింది. ప్రస్తుతం కీర్తి సురేష్ తన వైవాహిక జీవితాన్ని ఎంజాయ్ చేస్తూనే, వరుస సినిమాలతో కెరీర్ పరంగా కూడా దూసుకుపోతోంది.



**టాకీస్:** కొన్ని సంవత్సరాలు సినిమాలకు దూరంగా విలువైన సమయాన్ని వృథా చేశానని దర్శకుడు గుణశేఖర్ చెప్పారు. కానీ, ఇప్పుడు పూర్తిగా దృష్టిసారించినట్లు తెలిపారు. ఇకపై ఎలాంటి విరామం లేకుండా నిరంతరం సినిమాలు చేస్తానని, బలమైన కంటెంట్‌తో ప్రేక్షకుల ముందుకురావడమే తన లక్ష్యమని వెల్లడించారు. ప్రస్తుతం ఆయన యుఫోరియా సినిమాతో ముందుకు వచ్చారు. ప్రేమ కథలనైనా, దేశభక్తి చిత్రాలైనా, చారిత్రక సినిమాలనైనా తనదైన శైలిలో తెరకెక్కించగల దర్శకుడు గుణశేఖర్. ఇప్పుడాయన 'యుఫోరియా'తో పలకరించేందుకు సిద్ధమయ్యారు. ఈ సినిమా ఫిబ్రవరి 6న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో తాజాగా ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆయన తన కెరీర్ గురించి మాట్లాడారు. కొన్ని సినిమాలు ఆశించిన స్థాయిలో విజయాన్ని అందుకోలేదని 'యుఫోరియా'తో హిట్‌ను సొంతం చేసుకుంటానన్న నమ్మకం ఉందన్నారు. గతంతో పోలిస్తే తన అనుభవం, ఆలోచనా విధానం ఇప్పుడు మరింత ఉన్నతస్థాయికి చేరాయన్నారు. రాబోయే ప్రాజెక్టులు మరింత ప్రత్యేకంగా ఉంటాయని ఆయన నమ్మకం వ్యక్తం చేశారు.

# యుఫోరియాతో విజయం సాధిస్తా: గుణశేఖర్



1992లో ఇండస్ట్రీక్రి వచ్చిన గుణశేఖర్ వరుస సినిమాలతో అలరించారు. 2015లో 'రుద్రమదేవి' తర్వాత 8 సంవత్సరాలు విరామం తీసుకున్నారు. తర్వాత 2023లో సమంతతో 'శాకుంతలం' తీశారు. అది కూడా అనుకున్నస్థాయిలో విజయం సాధించలేదు. ఇప్పుడు మూడేళ్ల తర్వాత 'యుఫోరియా' అనే కొత్త కాన్సెప్ట్‌తో ప్రేక్షకులను పలకరించనున్నారు. నేటి యువతకు, కుటుంబ ప్రేక్షకులకు కనెక్ట్ అయ్యే వైవిధ్యమైన కథతో రూపొందిన చిత్రమిదని ఆయన తెలిపారు. భూమిక, సారా అర్జున్, నాజర్, రోహిత్, విఘ్నేశ్ గవిరెడ్డి ప్రధాన పాత్రలు పోషించారు.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.